# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 43 సంచిక : 22 విజయవాడ 20-3-2011 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- భారతదేశంలో టెర్రరిజపు వాస్తవ రూపాన్ని బట్టబయలు చేసిన ఎస్.ఎం.ముష్రిఫ్
- ప్రజల జీవితాలని, పచ్చని పంట పొలాలని కాలుష్యకోరలకు బలిచేస్తున్న బల్క్‌డ్రగ్ పరిశ్రమలు
- థర్మల్ విద్యుత్తుకేంద్ర ఆందోళనకారులపై పోలీసు కాల్పులు–ఖండన – సిపిఐ(ఎం.ఎల్), ఎం.సి.పి.ఐ(యు)


# కేంద్ర బడ్జెట్టు 2011–12

## 'సంస్కరణ'ల కొనసాగింపుకు ముసుగు కప్పిన ఆర్థిక మంత్రి

**బడ్జెట్టు** అంటే ప్రభుత్వ ఆదాయాన్నీ, వ్యయాన్ని, తెలిపే ప్రక్రియ. గడచిన ఏడాదిలో ఆదాయ, వ్యయాల అంచనాలు ముగింపులో ఎంతమేరకు సాధించబడ్డాయో తెలుపుతూ, వచ్చే సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయ, వ్యయాలు ఎలా వుంటాయో తెలిపే ప్రక్రియ ఇది. గత ఏడాది ఆదాయం పెంచుకునే ప్రయత్నాలు ఏ మేరకు ఫలించాయో చెప్పి ఈ ఏడాది ఆదాయ పెంపుకు తీసుకునే చర్యలను వివరిస్తుంది. అలాగే వ్యయం విషయంలో కూడా చేస్తుంది దీనితో ఆర్థిక సర్వేను విడుదల చేసి గత ఏడాది ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను సమీక్షిస్తుంది. గత బడ్జెట్టు ప్రతిపాదనలు దానినెలా ప్రభావితం చేశాయో తెలుపుతుంది. ఆర్థిక సర్వేలో బయల్పడిన రంగాల వారీ బలహీనతలను అధిగమించేందుకు ప్రభుత్వ వ్యయాన్ని ఎలా రూపు దిద్దుతుందో వివరిస్తుంది. ఏ రంగంలోకి ద్రవ్యాన్ని ఎక్కువ పంపుతుందో లేక తగ్గిస్తుందో చెబుతుంది. ఇలా చేయటానికి ప్రభుత్వం ఒక ద్రవ్య విధానాన్ని రూపొందించుకుంటుంది. బడ్జెట్టు రూపకల్పనలో ద్రవ్య విధానమే కీలకాంశంగా వుంటుంది.

30 ఏళ్ల క్రితం కేంద్ర బడ్జెట్టుపై వ్యాఖ్యానిస్తూ "జనశక్తి" "బడ్జెట్టుకు బయటే బడ్జెట్టు" అన్నది. బడ్జెట్టును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి కొన్ని నెలలు ముందుగానే పన్నులు విధించేది. ఆ విధంగా ఆదాయం పెంచుకుని గత అంచనాలు సాధించినట్లు, అందువల్ల లోటు లేనట్లు చెప్పుకునేది. బడ్జెట్టు ఉపన్యాసంలో కొత్త పన్నులు వేయలేదని చెప్పుకునేది. ఆ తర్వాత తిరిగి పన్నులు వేసి ప్రజలపై భారాలు మోపేది. ఆ విధంగా పార్లమెంటు ముందుంచే బడ్జెట్టుకు ఏ మాత్రం విలువ లేకుండా ఒక తంతుగా మార్చింది. అసలు బడ్జెట్టులో చేపట్టవలసిన చర్యలను ముందుగానో, తర్వాతో అమలు చేసేవి. చివరికి బడ్జెట్టు తద్దినాల తంతుగా దిగజార్చింది.

యు.పి.ఏ. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ కేంద్ర బడ్జెట్టులో ద్రవ్య విధానమన్న దానికే చోటు లేకుండా పోయింది. అదనపు వనరుల సేకరణ ఎలా చేయబోతున్నారో, అలాగే రంగాల వారిగా వృద్ధి కొరకు ఎలా వ్యయాన్ని చేయబోతున్నారో ప్రణబ్ ముఖర్జీ చెప్పలేదు. దీని స్థానంలో చిన్న చిన్న వివరాలతో సహా స్థూల జాతీయ ఉత్పత్తిలో వివిధ రంగాలకు కేటాయింపుల శాతాలతోనూ, కొద్దిపాటి రాయితీలు, ప్రభుత్వ లక్ష్యాల ప్రకటనలూ, అమలు చేద్దామని భావిస్తున్న పథకాలతో తన ఉపన్యాసాన్ని నింపివేశారు. అయితే యుపిఏ ప్రభుత్వానికొక ద్రవ్య విధానం లేదని చెప్పలేం. ఉంది. అదేమిటంటే ప్రజలపై అన్ని రకాలుగా భారాలు మోపి గోళ్లూడగొట్టి వసూలు చేసిన ధనంతో నింపిన ఖజానా నుండి బడాబూర్జువాలకు ఉదారంగా పంచిపెడితే ప్రైవేటు రంగం చొరవ చూపి ఆయారంగాలలో వృద్ధిని తెస్తుందన్నదే. ఈ అసలు ద్రవ్య విధానాన్ని కప్పి పుచ్చేందుకే, చర్చ అంతా వివిధ రంగాలకు కేటాయింపుల ఎక్కువ తక్కువ పై సాగేందుకు బడ్జెట్టు ఉపన్యాసాన్ని ఆర్థికమంత్రి తయారు చేశారు.

### ఆస్తులమ్మి రాయితీలు

ప్రపంచ ఆర్థిక మాంద్యత సాకు చెప్పి 2008–09 నుండి బడా బూర్జువా వర్గానికి రాయితీలనివ్వటం ప్రారంభించారు. వీటిని ఆర్థిక ఉద్దీపనా పథకాలన్నారు. కొన్ని సార్లు ప్రోత్సాహకాలన్నారు. ఏ పేరు పెట్టినా జరిగింది ప్రజాధనాన్ని బడాబూర్జువాలకు కట్టబెట్టడమే. 2009–10లో రూ. 4.53 లక్షల కోట్లు, 2010–11లో రూ॥ 5.11 లక్షల కోట్లను పన్నుల తగ్గింపు ద్వారా కట్టబెట్టింది. 2011–12 బడ్జెట్టులో బడాబూర్జువా వర్గానికి అనేక పన్నురాయితీలను ఆర్థిక మంత్రి ప్రకటించారు గానీ ఆ రాయితీల వల్ల ఎంత పన్ను ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందో చెప్పలేదు. కాగా మొత్తంగా పన్నుల నుండి ఎంత ఆదాయం పెరుగుతుందో మాత్రమే చెప్పారు. కనుక ఈ ఏడాది రాయితీల మొత్తమెంతో వెంటనే చెప్పటం సాధ్యంకాదుగానీ 2005 నుండి ఈ నాటివరకూ రూ॥ 20 లక్షల కోట్లను పన్ను రాయితీల ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోయిందని కొందరి అంచనా (పి. సాయినాథ్, ది హిందూ). ప్రజాధనాన్ని దోపిడీ వర్గాలకు కట్టబెడుతున్న ఈ విధానాన్ని కప్పిపుచ్చేందుకే ప్రణబ్ ముఖర్జీ ప్రయత్నించారు.

అలాగే ప్రభుత్వ ఆస్తులను అమ్మివేసి బడ్జెట్టులో లోటు లేనట్టు చూపించారు. 2జి స్పెక్ట్రం అమ్మకంలో ప్రభుత్వం 1,76,000 కోట్ల ఆదాయం కోల్పోయిందనే సంగతలా వుంచితే, ఒక లక్షకోట్లు ఆదాయం వచ్చింది. అలాగే ప్రభుత్వ రంగసంస్థల అమ్మకంలో ఈ ఏడాది రూ॥ 40 వేలకోట్లు ఆదాయం వస్తుందని ప్రణబ్‌ముఖర్జీ చెప్పారు. 'ప్రజల ఆస్తిగా ప్రభుత్వ రంగసంస్థల'న్న కొత్త పేరు దీనికి పెట్టారు. ప్రభుత్వ ఆస్థులమ్మి బడాబూర్జువాలకిచ్చిన రాయితీలను పూడ్చుకునే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తున్నది.

### నల్లధనంపై "పోరు"

ఆర్థిక మంత్రి ఇక్కడితో తృప్తి చెందలేదు. విదేశీ శాఖలున్న బడా కంపెనీలు పొందే లాభాలపై (డివిడెండ్ల రూపంలో) పన్నును సగం తగ్గించాడు. ఇంతకు ముందు విదేశీ శాఖ తన భారత మాతృసంస్థకు చెల్లించే డివిడెండుపై 33.3 శాతం పన్ను వుండేది ఇప్పుడు దాన్ని 15 శాతానికి తగ్గించాడు. అలాగే మ్యూచువల్ ఫండ్సులో విదేశీయులు పెట్టుబడులు పెట్టడానికి అనుమతించాడు. తప్పుడు లెక్కలతో పన్నులు ఎగ్గొట్టి విదేశీ బ్యాంకులో నల్ల ధనాన్ని దాచుకోవటంలో ప్రధాన పాత్ర బడాబూర్జువా వర్గానిదే. పై రెండు పద్ధతుల ద్వారా విదేశీ బ్యాంకుల్లో దాచిన అక్రమార్జనలను దేశంలోకి తిరిగి తెచ్చుకునేందుకు ప్రణబ్ అవకాశ మిచ్చాడని నిపుణులంటున్నారు. వీరేకాక రెండుసార్లు కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా కూడా ఇదే విమర్శ చేస్తున్నాడు. "ఎప్పుడెప్పుడు భారత్‌లోకి ప్రవేశిద్దామా అని ఉవ్విళ్లూరుతూ విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనానికి దేశంలోకి వచ్చేందుకు రూపొందించిన పథకాలివి" అని ఆయన అన్నాడు.

### పేరురైతుదీ, వ్యవసాయానిదీ–పందారాలు బడాబూర్జువాలకు

వృద్ధి వ్యూహంలో వ్యవసాయాభివృద్ధిది కీలక పాత్ర అన్న ఆర్థిక మంత్రి వ్యవసాయ, వ్యవసాయ ప్రాసెసింగు రంగాల్లోకి ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించే ప్రక్రియను మరింత విస్తరిస్తానని చెప్పాడు. ఈ బడ్జెట్టు వ్యవసాయానికనుకూలమైందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ పొగిడింది. దాని అధ్యక్షుడు రాకేష్ మిట్టల్ ఈ బడ్టెటు చర్యలు... "పెద్దయెత్తున ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షిస్తాయ"ని ప్రకటించాడు. బడాబూర్జువాల మన్ననలు పొందిన ఆర్థిక మంత్రి తీసుకున్న చర్యలేమిటి?

వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపు పెరిగితే రైతాంగపు వ్యక్తిగత మదుపు పెరుగుతుంది. ఉదాహరణకు ప్రభుత్వం నీటిపారుదల డ్యాములు నిర్మిస్తే దానికనువుగా భూమిని అభివృద్ధి చేయటానికీ, పంటల నిర్వహణా పద్ధతులకు రైతాంగపు పెట్టుబడిమదుపు పెరుగుతుంది. అలా పెరిగిన మదుపు అవసరాన్ని తీర్చుకునేందుకు రైతాంగపు రుణ అవసరాలు పెరుగుతాయి. ప్రభుత్వం రైతాంగానికి రుణ పరపతి సౌకర్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. అయితే ఆర్థిక మంత్రి వ్యవసాయం దాని అనుబంధ కార్యకలాపాలకు బడ్జెట్టులో కేటాయింపులను తగ్గించాడు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపునూ తగ్గించాడు. కాగా రైతాంగానికి రుణ పరపతిని మరో లక్షకోట్లు పెంచుతున్నట్లు ప్రకటించాడు.

పట్టిక–1ని గమనిస్తే 2008–09లో వ్యవసాయరంగ వృద్ధిరేటు–0.4 శాతం. అదే 2009–10లో 0.1 శాతం. 2010–11లో 2శాతమని అంచనాను ప్రభుత్వం ప్రకటటించింది గానీ వాస్తవరేటు దానిదరిదాపుల్లోకూడా వుండదు. ఈ నాటికీ 60 శాతానికి పైగా జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి వున్నందున, త్వరితగతిన వ్యవసాయ వృద్ధి రేటును పెంచాల్సివుంది. అంటే వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపు యిబ్బడిగా పెంచాల్సిన అవసరముంది.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

# జపాను విషాదం–గుణపాఠాలు

**ముందస్తు** హెచ్చరికలు చేయటానికి కూడా సాధ్యపడని తీవ్రస్థాయిలో వచ్చిన భూకంపమూ, దానిని వెన్నంటి విరుచుకుపడ్డ సునామీ జపాను ఈశాన్య ప్రాంతంలో అపార జననష్టమూ, ఆస్థినష్టమూ కలిగించాయి. ఈ ప్రకృతి విలయ తాండవానికి ఫుకుషిమా అణువిద్యుత్తు కేంద్రంలోని నాలుగు రియాక్టర్లకు మూడింటిలో పేలుళ్లు సంభవించాయి. అణుధార్మికత వాతావరణంలోకి ప్రసరిస్తున్నది. వాటిని శీతలపరిచే చర్యలన్నీ విఫలమయ్యాయి. ప్రకృతి వైపరీత్యమైన భూకంపానికీ, సునామీకి 10వేల మందిపైగా ప్రాణాలు కోల్పోయారు. 170 కి.మీ. దూరాన వున్న టోక్యోలో అణుధార్మికత సాధారణ స్థాయికన్నా 100 రెట్లు ఎక్కువగా వుందని అధికారిక ప్రకటనలు తెలుపుతున్నాయి. మూడు రకాలుగా ప్రమాదాలు ఏకకాలంలో సంభవించటంతో జపాను ప్రజలు ప్రాణాలరచేత పట్టుకుని ఆందోళనా భరితులైవున్నారు. ఆప్తులను కోల్పోయిన దుఃఖం, బంధుమిత్రుల ఆచూకీకోసం వెదుకులాటలతోపాటు అణుధార్మికత తమపై చూపబోయే ప్రమాదాల గురించిన తీవ్ర మానసిక క్షోభ వారిని తల్లడిల్లచేస్తున్నది. ఆహారం, తాగునీటికి ఏర్పడ్డ కొరత వారిని పట్టిపీడిస్తున్నది. అణుకేంద్రానికి 20 కి.మీ. పరిధివరకూ జనావాసాలను ఖాళీచేయించినా, వారు తలదాచుకునేందుకు ఎలాంటి భద్రమైన చోటూ లేకుండా పోయింది. జపాను ప్రజానీకానికి "జనశక్తి" తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది. ఇన్ని కష్టాల మధ్య కూడా క్రమశిక్షణతో వ్యవహరిస్తున్న జపాను ప్రజలు తమ నైతిక ధృతిని చూపారు. ఈ ప్రకృతి బీభత్సాన్ని వారు ఐక్యంగా అధిగమిస్తారు. సూర్యుడు తిరిగి ఉదయిస్తాడు.

తరచుగా భూకంపాలు దాని వెన్నంటి సునామీలు వచ్చే దేశం జపాను. వాటిని గుర్తించి ముందుగా హెచ్చరికలు చేయగల అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ జపానుకుంది. అయినా ప్రకృతి శక్తిముందు ఇవి నిలవలేకపోయాయి. భూకంపాలు, సునామీలు, తుఫానులను ఆపటం సాధ్యంకాదు. అయితే వాటి రాకను తెలుపగల విజ్ఞానమూ, వాటినుండి తక్కువ నష్టాలతో బయటపడగల పద్ధతులూ రూపొందాయి. భూకంపమే ప్రాణనష్టం కలిగించదు. దానివల్ల కూలిపోయే భవనాలే ప్రాణనష్టం కలిగిస్తాయి. లాతూరు, భుజ్‌లలో వచ్చిన భూకంపాలు అధిక ప్రాణనష్టం కల్గించగా, సాంప్రదాయక గృహనిర్మాణంవున్న హిమాచల్‌ప్రదేశ్‌లో వచ్చిన భూకంపం అతితక్కువ ప్రాణనష్టం కలిగించింది. భూకంపాలకు తట్టుకునే విధంగా బహుళ అంతస్తుల భవనాలతో సహా గృహనిర్మాణ పద్ధతులను అనుసరిస్తే ప్రాణనష్టాలను కనీసస్థాయికి తగ్గించవచ్చు. జపాను చేసిందిదే. తరతరాలుగా జపాను ప్రజలనుసరించిన గృహనిర్మాణ పద్ధతులను ఆధునిక విజ్ఞానంతో మేళవించారు. దీనికి తగిన ఆర్థిక స్థోమత జపానుకుంది. ఈ గృహనిర్మాణ పద్ధతులే అనుసరించకుండా వున్నట్లయితే ప్రస్తుత విపత్కర స్థితికి జపాను జనాభాలో నాల్గవవంతు తుడిచిపెట్టుకుపోయి వుండేది. ఈ ఆర్థిక స్థోమతలేని పేదదేశాల ప్రజలు ఎక్కువగానూ, తరచుగానూ వినాశనానికి గురౌతున్నారు. మూడవ ప్రపంచ దేశాలలో ఈ సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు ఎక్కువగా అందుబాటులో వుంది. భూకంపాలకు గురయ్యే అవకాశాలున్న ప్రాంతాలను గుర్తించినా, కనీసం పేదలకు నిర్మించి ఇస్తున్న ఇళ్లలో కూడా తగిన జాగ్రత్తలు ప్రభుత్వం పాటించటం లేదు. సునామీ వచ్చి దశాబ్దం గడిచిపోయినా ఇంతవరకూ ఘనప్రకటనలే తప్ప ముందస్తు హెచ్చరికల వ్యవస్థ నెలకొల్పలేదు. భూకంపమూ, సునామీలు వస్తే ముంబాయి, కొచ్చిను, చెన్నై, విశాఖవంటి నగరాలు ఎంతటి విధ్వంసానికి గురవుతాయో వూహించటానికి కూడా సాధ్యంకాదు.

హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు సాగించిన విధ్వంసకాండ 60 ఏళ్లు గడిచినా జపాను ప్రజల కళ్లముందు సజీవంగానే వుంది. దాని దుష్ఫలితాలు వారిని నేటికీ పట్టిపీడిస్తున్నాయి. అయినా ఇతర శక్తివనరులు లేక అణువిద్యుదుత్పత్తిని చేపట్టింది. అణువిధ్వంసానికి గురైన దేశంగా వీటికి అత్యంత భద్రతా ఏర్పాటు చేసివుంటారని ఆశించినా, అణువిద్యుత్తు కేంద్రాలు ప్రమాద రహితంకావని జపాను అనుభవం తెలుపుతున్నది. ఈ అణువిద్యుత్తు కేంద్రాల్లో ఇంతకుముందు రెండు ప్రమాదాలు జరిగాయి. అవి చిన్నవే అయినా ప్రమాదాలే. 2 కి.మీ. పరిధిలో ప్రజలందరినీ ఖాళీచేయించి, అణుధార్మికతకు గురయ్యారో లేదోనని వారందరికీ పరీక్షలు నిర్వహించాల్సివచ్చింది. ఇప్పుడు జరిగింది–అమెరికాలోని లాంగ్‌ఐలాండ్, రష్యాలోని ఛెర్నోబిల్ అణుప్రమాదాలంత పెద్దవి. అణువిద్యుత్తు కేంద్రాలు ప్రమాదాతీతంగా పూర్తి భద్రతతో నిర్మించటం సాధ్యంకాదని ఇప్పుడు మరోసారి నిరూపితమైంది. అణుప్రమాదాలతో జరిగే తక్షణ నష్టమొకయెత్తైతే, అనేక తరాలపాటు అది చూపే దుష్ప్రభావాలూ మరింత కృంగదీసేవి. మిగిలిన ప్రమాదాలు స్థానిక ప్రభావాన్ని కలిగిస్తాయి. కాగా అణుప్రమాదాల దుష్ప్రభావానికి సరిహద్దులుండవు. ఎక్కడో జరిగిన ప్రమాదం మనమీదెక్కడ విరుచుకుపడుతుందోనని ప్రపంచ ప్రజలందరూ భయంగుప్పిట్లో విలవిల్లాడాల్సిందే. అణువిద్యుత్తు కేంద్రాల ఉనికినే ఈ ప్రమాదం మరోసారి ప్రశ్నిస్తున్నది.

ఈ అనుభవం భారత అణువిద్యుదుత్పత్తి కార్యక్రమాన్ని మొత్తంగా తిరగతోడాల్సిన అవసరాన్ని తెలుపుతున్నది. దేశంలో ఇప్పటికే 20 అణురియాక్టర్లున్నాయి. మరో 20 నిర్మించబోతున్నారు. సూరత్‌వద్ద కాక్రపాల్,ముంబాయివద్ద తారాపూర్, కర్ణాటకలో కైగా, చెన్నైవద్ద కల్పకం సముద్ర తీరాన వున్నాయి. రాజస్తాన్ ఎడారిలోనే రెండు రియాక్టర్లు వున్నాయి. ఇవికాక తమిళనాడులోని కూడకుళంవద్ద ఆరు రియాక్టర్ల నిర్మాణం సాగుతున్నది. మహారాష్ట్ర తీరంలోని జైత్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లోని రణస్థలం, నిజాంపట్నం, ఒరిస్సాలోని పారాదీప్‌ల వద్ద రెండేసి రియాక్టర్లతో అణువిద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. ఇవన్నీ సముద్ర తీరాన వున్నవే. అన్నీ సునామీకి గురికాగల ప్రాంతాలే. వీటిని సముద్ర మట్టానికి ఎత్తున కట్టామనే, కుంటివాదనల బండారం ఇండోనేషియా భూకంపానికి వచ్చిన సునామీకి కల్పకం కేంద్రంలోకి నీళ్లు వచ్చి మూసివేయాల్సి రావటంతో బట్టబయలైంది. జపాను భూకంపానికి అణగిపోయిన అగ్నిపర్వతం తిరిగి రగులుకున్నదని పేలగల ప్రమాద సూచనలు ఏర్పడ్డాయి. ఇదే భూకంపం అండమాన్ దీవులకు భారత్‌కు మధ్యవస్తే ఏర్పడే సునామీకి (ఇది భూకంపాలు ఏర్పడే ప్రాంతమే) తూర్పుతీరంలోని ఈ అణువిద్యుత్తు కేంద్రాలు సురక్షితమన్న హామీ లేదు.

(తరువాయి 2వ పేజీలో)

| పట్టిక : 1 | వ్యవసాయం అనుబంధ కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వ వ్యయం | | | | |
|---|---|---|---|---|---|
| | రెవిన్యూ వ్యయం | | పెట్టుబడివ్యయం | | తగ్గుదల |
| | 2010-11 | 2011-12 | 2010-11 | 2011-12 | |
| వ్యవసాయం అనుబంధం | 124451 | 118883 | 532 | 678 | -4.3% |
| పంటల పోషణ | 47949 | 43472 | 19 | 25 | -9.3% |
| నిల్వ గోదాములు | 63636 | 62199 | 129 | 113 | -2.3% |
| వ్యవసాయ పరిశోధన,విద్య | 4932 | 4646 | -- | -- | -5.8% |

- కోట్లరూపాయల్లో
- బడ్జెట్టు పత్రాలు ఆధారంగా (ఫ్రంటులైన్ 25-3-2011)

## కేంద్ర బడ్జెట్టు,,, (మొదటి పేజీ తరువాయి)

కానీ ఆర్థిక మంత్రి వ్యవసాయ రంగంలో వ్యయాన్ని తగ్గించటంతో పాటుగా, పెట్టుబడి వ్యయాన్ని ద్రవ్యోల్బణం మేరకు కూడా పెంచలేదు. ఈ ఏడాది ఎరువుల సబ్సిడీని రూ॥ 4978 కోట్లు, ఆహార సబ్సిడీని రూ॥ 27 కోట్లు తగ్గించారు. ఈ తగ్గింపుతో మిగిలిన ధనాన్ని వ్యవసాయ రంగానికైనా వెచ్చించలేదు. దీని అర్థం స్పష్టం. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపును మానివేస్తున్నది. ప్రైవేటు పెట్టుబడి మదుపును ప్రోత్సహిస్తున్నది.

గోదాముల నిర్మాణానికి ఆర్థిక మంత్రి వ్యయాన్ని తగ్గించాడు. కానీ గోదాములను వ్యవసాయ రంగ మౌలిక నిర్మాణంలో చేర్చాడు. సరఫరా గొలుసులో నష్టాలను తగ్గించి పెరిగిన ధరలను తగ్గిస్తాననీ అందుకోసం గోదాముల నిర్మాణంలోకి ప్రైవేటు పెట్టుబడిని ఆకర్షిస్తాననీ చెప్పాడు. అంతేకాక సరఫరా గొలుసుకు మార్కెట్టుయార్డు చట్టాలు ఆటంకంగా వున్నందున వాటిని ప్రైవేటు పెట్టుబడికి అనుకూలంగా మారుస్తానని వాగ్దానం చేశాడు. సరిగ్గా ఈ కారణం రీత్యానే బడా బూర్జువా ప్రతినిధులు వ్యవసాయ అనుకూల బడ్జెట్టనిపొగిడారు. బడ్జెట్టులో పరిబాషకు కొత్త నిఘంటువును మనం తయారు చేసుకోవాలి. వ్యవసాయమంటే ప్రైవేటు పెట్టుబడి, రైతు అంటే కంపెనీలు వగైరా.

అందుకనే ఆర్థిక మంత్రి రైతాంగానికి రుణ పరపతిని రూ॥ 3,75,000 కోట్ల నుండి రు. 4,75,000 కోట్లకు పెంచినట్లు, రైతాంగానికిస్తున్న రుణాల వడ్డీ తగ్గింపును ప్రభుత్వం చెల్లించే విధానాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించాడు. ఇక్కడ రైతులంటే కంపెనీలని ఆయన అర్థమన్నది తెలుసుకునేందుకు రైతాంగరుణ వితరణ తీరు తెన్నులను లోతుగా పరిశీలించాలి.

వ్యవసాయ రంగానికిచ్చే రుణాలను ప్రత్యక్ష రుణాలు, పరోక్షరుణాలు అని రెండుగా పేర్కొంటారు. పంటరుణాలు, భూమి అభివృద్ధి, నీటిపారుదల (బోరుబావులు) ఉపకరణాలు (మరనాగళ్లు, ట్రాక్టర్లు) మొ॥ వాటికి ఇచ్చేరుణాలను ప్రత్యక్ష రుణాలంటారు. రైతాంగానికి అందేవి యివే. పంటలు నిల్వచేసుకునే గోదాములకూ, హార్వెస్టర్లు, బిందుసేద్యపరికరాలకూ, అగ్రిప్రాసెసింగ్ పరిశ్రమలకూ తదితరాలకు యిచ్చే రుణాలను పరోక్ష రుణాలు అంటారు.

వ్యవసాయరంగానికి బ్యాంకు లిచ్చే రుణాలను ప్రాధాన్యతా రంగంగా ప్రభుత్వం పేర్కొంది. ఏ ఏ రుణాలను వ్యవసాయ రుణాలుగా పేర్కొనవచ్చో నిర్వచించింది. యుపిఏ ప్రభుత్వం ఈ నిర్వచనాలను మార్చటం ద్వారా ఇతర రుణాలను కూడా ప్రాధాన్యతా రుణాలుగా చూపే అవకాశ మిచ్చింది. ఉదాహరణకు శీతల గిడ్డంగులకిచ్చే రుణంలో మూడవవంతును ప్రాధాన్యతా రంగంగా చూపవచ్చు. బ్యాంకులు వీటికి రుణాలిచ్చి రైతాంగానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించుకున్నట్లు చూపుతున్నాయి. మరోమాటల్లో చెప్పాలంటే పరిశ్రమాధిపతులకు యిచ్చిన రుణాలలో కొంతభాగాన్ని వ్యవసాయ రుణంగా చూపుతున్నారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలకిచ్చే రుణాలను కూడా "వ్యవసాయ రుణాలు"గా నిర్వచించారు.

యుపిఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి రుణ వితరణ బాగా పెరిగింది. అయితే ఈ రుణాలు రైతాంగానికి అందటం లేదు. ఎందుకంటే వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపు తగ్గింది గనుక రైతాంగానికందుతున్నది పంట రుణాలు మాత్రమే. ఇది రైతాంగం రుణ అవసరాలలో 20 శాతాన్ని మాత్రమే తీరుస్తున్నది. వ్యవసాయ రంగానికి పెరిగిన రుణ పరపతి సౌకర్యంలో రైతాంగం వాటా తక్కువే. పట్టిక-2 ను చూస్తే 1990లో ప్రత్యక్ష రుణాలు 86 శాతముండగా 2009లో అది 77 శాతానికి తగ్గింది. అంటే రైతాంగానికందుతున్న రుణాలు తగ్గిపోగా, పరిశ్రమాధిపతులకు అందిస్తున్న రుణాలు వ్యవసాయరుణాల్లో నాల్గవవంతు వరకూ వున్నాయి.

అలాగే పట్టిక-3ను గమనిస్తే 2 లక్షల లోపు రుణాలు 1990లో 82.6 శాతముండగా 2009కి 44 శాతానికి తగ్గిపోయాయి. అలాగే పదికోట్ల రూ॥ పైబడిన రుణ మొత్తాలు 1990లో 10.3 శాతం నుండి 20.4 శాతానికి పెరిగాయి. పేద మధ్యతరగతి రైతాంగం పొందేది 2 లక్షల లోపు రుణాలే. మిగిలిన పెద్ద మొత్తం రుణాలు ధనిక, భూస్వామ్య, పరిశ్రమాధిపతులు పొందేవే. అంటే వారి రుణాలు సగానికి పైగా వున్నాయి.

ఇంతేకాదు వ్యవసాయ రంగానికిస్తున్న పరోక్ష రుణాలలో 62 శాతం పద్దులు ఒక్కొక్కటీ 25 కోట్ల రూ॥లకు పైగా రుణ మొత్తాన్ని పొందాయి. (2009) ప్రత్యక్ష రుణాలలోకూడా యిదేపరిస్థితివుంది. 1990లో కోటి రూ॥లకు పైగా రుణం పొందిన పద్దులు లెక్కించరానంత తక్కువగా వుండేవి. 2009లో ఈ పద్దులు 10.5 శాతానికి పెరిగాయి. వాటిలో 25 కోట్ల రుణ మొత్తాన్ని పొందిన పద్దులు 4.5 శాతం.

| పట్టిక : 2 | వ్యవసాయరంగానికి వాణిజ్య బ్యాంకుల రుణాలు (శాతాలలో) | | |
|---|---|---|---|
| సంవత్సరం | ప్రత్యక్ష రుణాలు | పరోక్ష రుణాలు | మొత్తం |
| 1985 | 83.2 | 16.8 | 100 |
| 1990 | 86.8 | 13.2 | 100 |
| 2000 | 84.5 | 15.5 | 100 |
| 2005 | 76.1 | 23.9 | 100 |
| 2009 | 77.1 | 22.9 | 100 |

ఆధారం: రిజర్వు బ్యాంకు నివేదికలు (ఆర్. రవికుమార్, ఫ్రంటులైన్)

కనుక యుపిఏ ప్రభుత్వం పాలనలో వ్యవసాయ రంగానికి పెరిగిన రుణ పరపతి ఎవరికి చేరిందో స్పష్టంగానే వుంది. పేరు రైతాంగానిదీ పంపకం జరిగింది మాత్రం బడాబూర్జువాలకు! దాదాపు మూడు లక్షల మంది రైతాంగం రుణాల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యల పాలబడ్డా, రైతాంగం పేరు చెప్పి బడాబూర్జువా వర్గానికి ద్రవ్యనిధులు కట్టబెట్టి బలీయం చేస్తూ వ్యవసాయ అనుకూల విధానమని కీర్తిగానాలు చేస్తున్నదంటే రైతాంగాన్ని భూముల నుండి గెంటివేసే విధానాలను ఉద్దేశపూరితంగానే అమలు చేస్తున్నది. భూమి హీనులైన రైతాంగాన్ని బడాబూర్జువాల దోపిడీ ముందు నిస్సహాయులుగా వుంచే కార్పోరేటు/కాంట్రాక్టు సాగులో రైతాంగాన్ని బంధించే విధానాన్ని కొనసాగిస్తానని ఈ బడ్జెట్టుతో మరోసారి స్పష్టం చేసింది. రైతాంగానికి రుణ పరపతి గురించి పాలకుల వాగ్దానాలన్నీ అజాగళస్థనాలే.

### మేలి ముసుగులు

కార్పోరేటు/కాంట్రాక్టు సాగును నెలకొల్పేందుకు అనువుగా బడా బూర్జువా వర్గానికి ద్రవ్య నిధులను సమకూర్చుతున్న విధానాన్ని కప్పి పుచ్చేందుకు ఆర్థిక మంత్రి వ్యవసాయాభివృద్ధి పేరుతో మేలిముసుగులు కప్పాడు. పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు పప్పు గ్రామాలుగా 60 వేల గ్రామాల గుర్తింపు, కూరగాయల పెంపక గ్రామ సముదాయాల ఏర్పాటు, పామాయిలు తోటలకు ప్రోత్సాహం, తృణ ధాన్యాల వినియోగాన్ని పెంచటం, పశుగ్రాస పంటల పెంపు, పాడి, కోళ్లు, చేపలు, గొర్రెలు, మేకల పెంపకంతో బలవర్థక ఆహారం లభ్యత పెంచటం వంటి పథకాలను ప్రకటించాడు. వీటన్నింటికీ కలిపి రూ॥ 600 కోట్లను కేటాయించాడు. ఈ రంగాలలో లక్షలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయన్న వాస్తవాన్ని గుర్తుకు తెచ్చుకుంటే, ఈ కేటాయింపులు సముద్రంలో నీటిబొట్టు లాంటివే.

మరోకోణం నుండి చూస్తే దీనిలో కూడా ప్రభుత్వానికి అప్రకటిత లక్ష్యాలున్నాయి. వంటనూనెలను దిగుమతి చేసుకునే స్థితి నుండి రాజీవ్ టెక్నాలజీ మిషన్‌తో ఐదేళ్లలోనే వంట నూనెల్లో స్వయం సమృద్ధిని సాధించాం. రైతాంగానికి తగిన సహాయమందిస్తే దిగుబడులు పెంచగలరని నిరూపితమయింది. అయితే ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందం తర్వాత సామ్రాజ్యవాదుల వత్తిడికి లొంగి పామాయిలు దిగుమతులను వరదలా అనుమతించింది. తత్పర్యవసానంగా వంటనూనెల దిగుమతుల్లో ప్రపంచంలో "మొదటి" స్థానానికి వచ్చింది. తిరిగి వంట నూనె గింజల పెంపకానికి ప్రోత్సాహమిస్తున్న పేరుతో పామాయిలు పెంపకానికి ఆర్థిక మంత్రి ప్రోత్సాహకాలివ్వపూనుకున్నాడు. చిన్నగానుగతో కొద్దిపాటి పెట్టుబడితో ప్రతిగ్రామంలోనూ నూనె వెలికి తీయగల నువ్వులు, వేరు శనగ, ఆవాలు వంటి తరతరాలుగా రైతాంగం అభివృద్ధి చేసిన నూనెగింజల పంటల స్థానంలో కనీసం రూ॥ 100 కోట్ల పెట్టుబడి అవసరమయ్యే బడా పరిశ్రమ మాత్రమే నూనెను వెలికి తీయగల పామాయిలు తోటలను పోత్సహిస్తున్నారు. ఆ విధంగా సాంప్రదాయక పంటలను నాశనం చేసి, పరిశ్రమలకు ముడి సరుకును సరఫరా చేసే పంటను ప్రోత్సహిస్తున్నారు. భారత బడా బూర్జువాలు ఈ పరిశ్రమలు ప్రారంభించినా, ఈ రంగంలో గుత్తాధిపత్యంగల సామ్రాజ్య వాదులు (పామాయిలులో 80 శాతం అమెరికా కంపెనీ బంగీ ఆధీనంలో వుంది) సాంకేతిక పరిజ్ఞానం పేరిట ఈ రంగంలోకి త్వరలోనే ప్రవేశిస్తారు. పొగాకు, చెరకు, ప్రత్తి రైతాంగం అనుభవాన్ని తీసుకుంటే ఈ పరిశ్రమలు ఇటు రైతాంగాన్ని, అటు వినియోగదారులైన ప్రజలనూ కూడా నిలువుదోపిడీ చేస్తాయి.

ఇలాంటి అప్రకటిత లక్ష్యాలే మిగిలిన చర్యల్లోనూ వున్నాయి. కూరగాయల గ్రామ సముదాయాల గుర్తింపు ఆర్థిక మంత్రి మాటల్లోనే "సరఫరా గొలుసును పటిష్టం చేసే మార్కెట్టుల నిర్మాణంతో రైతాంగానికి, ప్రజలకూ సరసమైన ధర లభించేట్లుచూడటం" లక్ష్యం అంటే ప్రైవేటు పెట్టుబడికి అవసరమైన మౌలిక నిర్మాణాన్ని చేపట్టడం, దానికొనసాగింపుగా రిటైల్ వాణిజ్యంలోకి విదేశీ పెట్టుబడులను ప్రవేశ పెట్టేందుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించటం ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి "ఆహార ద్రవ్యోల్బణ"మని తాము పిలుస్తున్న ఆహార సరుకుల ధరల పెరుగుదలకు కూరగాయల ధరల పెరుగుదలే కారణమనీ, ధరల పెరుగుదల అదుపుకు ఈ చర్య సరిపోతుందనీ చెప్పకనే చెప్పాడు.

### దారిదోపిడీ నిధులు

సూక్ష్మరుణ సంస్థల ఆగడాలు తెలిసినవే. వీటి నిలువు దోపిడీలో చిక్కుకుని పేద ప్రజలు విలవిలలాడుతున్నారు. కాగా ప్రజలను దారిద్ర్యం నుండి బయట పడవేసే సాధనాలుగా వీటిని కీర్తించిన ఆర్థిక మంత్రి వీటి దోపిడీని బలీయం చేసేందుకు వంద కోట్ల రూపాయలతో నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఆంధ్ర ప్రదేశ్ చేసిన చట్టాన్ని తొలగించి కేంద్రమే ఒక చట్టాన్ని తెస్తుందని ప్రకటించాడు. మాలేగాం కమిటీ నివేదికను అమలు చేసేందుకు పూనుకున్నాడు. ఇంతకీ ఈ చట్టంగానీ, ఇతరచట్టాలుగానీ వర్తించేది సూక్ష్మరుణ సంస్థల్లో 8 శాతానికి మాత్రమే. మిగిలిన 92 శాతం సంస్థలనూ 'అదుపు'లోకి తేవటానికి ఏంచెయ్యాలో పాలుబోక తలపట్టుకు కూర్చున్నాడు ఆర్థిక మంత్రి. అందుకే చట్టాన్ని చేయటంలో ఆలశ్యమవుతున్నది. ఆచరణలో దీని అర్థం ఒకటే. సూక్ష్మరుణ సంస్థలను నామమాత్రపు అదుపులోకి తేవటం కూడా ఆర్థిక మంత్రి చేయబోవటం లేదు.

### "పూజ్య" సంక్షేమం

సంక్షేమ నినాదం భారతపాలకుల వంచనా శిల్పంగా వుంది. దానిని నిరంతరం పూజిస్తారుగానీ దానికోసం చేసేది పూజ్యం. దీనికి ఇటీవల వీరుపెట్టిన పేరు సామాజిక వ్యయం. దీనిలో భాగంగానే ఆహార భద్రత, విద్యాహక్కు, ఆరోగ్యహక్కు మొదలగు వాటి గురించి ఎడతెగని చర్చలు చేస్తున్నారు. అయితే వీటి అమలును నామమాత్రపు చర్యలతో సరిపుచ్చుతున్నారు.

ఆహార భద్రత కల్పించే విధంగా ఆహార హక్కు చట్టాన్ని చేయాలని సోనియాగాంధి ప్రతిపాదన. ఆమేరకు ఒక ముసాయిదా బిల్లును ప్రభుత్వానికి పంపారు. దానిని పరిశీలించిన రంగరాజన్ కమిటీ ఇది అమలు చేయటం సాధ్యంకాదనీ, అంత డబ్బులేదనీ తిరస్కరించింది. అయినా సరే అమలు జరపాలంటూ సోనియాగాంధి ప్రధాన మంత్రిని ఆదేశించారు. దీనినమలు చేయటానికి తక్కువలో తక్కువ రూ॥ 10 వేల కోట్ల నుండి ఎక్కువలో ఎక్కువ రూ॥ 50 వేల కోట్లు ఖర్చు అవుతాయని అధికారిక అంచనా.

ఆహార భద్రత ఊసుకూడా ఆర్థిక మంత్రి ఎత్తుకోలేదు. వ్యవసాయ రంగంలోకి ప్రైవేటు పెట్టుబడిని ఆకర్షించే చర్యలే ఆహార భద్రతను కల్పిస్తుందన్నది ఆయన చెప్పకుండా వూరుకున్న అంశం. అందువల్లనే ఆహార సబ్సిడీని రూ॥ 60,600 కోట్ల నుండి రూ॥ 60,573 కోట్లకు తగ్గించాడు. ఆహార భద్రత కల్పించాలంటే ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నది అందరూ అంగీకరించే విషయమే. దీన్ని పటిష్టం చేయడానికి క్రితం బడ్జెట్టులో ప్రభుత్వం ఖర్చు చేసింది 4 కోట్లరూపాయలైతే, ఈ బడ్జెట్టులో కేటాయించింది 85 లక్షలు. ఇది ఆర్థిక మంత్రిగారి కారు పెట్రోలు ఖర్చుకు సమానం.

ఇక గ్రామీణ ఉపాధి హామీపథకం. ఈపథకం రావటమే ప్రభుత్వ విధానాలు ప్రజలకు నిలకడైన ఉపాధిని కల్పించటంలో విఫలమయ్యాయని తెలుపుతుంది, అయినా ప్రజల అసంతృప్తిని చల్లార్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. పథకం క్రింద సగటున 50 రోజులు మాత్రమే పనికల్పించగలిగామనీ, వాగ్దానం చేసిన 100 రోజులపని కల్పనను ఈ ఏడాది సాధిస్తామనీ ఆర్థిక మంత్రి చెప్పారు. అంతేకాక ద్రవ్యోల్బణాన్ని అనుసరించి ఈ పథకంలో వేతనాలు

(తరువాయి 7వ పేజీలో)

| పట్టిక : 3 | వ్యవసాయరంగానికి వాణిజ్య బ్యాంకుల రుణాలు (శాతాలలో) | | | |
|---|---|---|---|---|
| రుణ మొత్తం(రూ॥) | 1990 | 2000 | 2005 | 2009 |
| 2 లక్షల లోపు | 82.6 | 67.6 | 51.9 | 44.3 |
| 2 నుండి 10 లక్షలు | 4.3 | 11.7 | 17.9 | 22.6 |
| 10 లక్షలనుండి 1 కోటి | 7.6 | 6.6 | 6.4 | 6.4 |
| 1 కోటి నుండి 10 కోట్లు | 4.2 | 6.7 | 8.0 | 6.3 |
| 10 కోట్ల నుండి 25 కోట్లు | 1.3 | 1.7 | 3.3 | 2.7 |
| 25 కోట్ల పైన | | 5.7 | 12.6 | 17.7 |
| మొత్తం | 100 | 100 | 100 | 100 |

ఆధారం : రిజర్వుబ్యాంకు నివేదికలు (ఆర్. రవికుమార్, ఫ్రంటులైన్)

## జపాను... (మొదటి పేజీ తరువాయి)

ప్రకృతి వైపరీత్యం చెప్పిరాదు; అందుకే ప్రమాదమంటున్నాం. ఇంతకు ముందు వచ్చిన వైపరీత్యపు స్థాయినిబట్టి (అంతా సజావుగా నిర్మిస్తే) భద్రతా చర్యలు తీసుకుంటారు. దానిని మించిన స్థాయిలో వైపరీత్యం రాదన్న హామీ వుండదు.

జపాను సామ్రాజ్యవాదులు అణుకేంద్రాలను తామే నిర్మించుకుని, నిర్వహించుకుంటున్నారు. కాగా భారత్‌కు అణువిద్యుత్తు కేంద్రాలను నిర్మించిపెట్టేది అమెరికా, రష్యా, ఫ్రాన్సు, జర్మనీలే. తమ దేశాలలోనే అవి ప్రమాదాలను నివారించలేకపోయాయి. ఇంతేకాక వీటిని నడిపే నిర్వహించే పనిని కూడా వారికి అప్పగించే అవకాశాన్ని కూడా ఒప్పందంలో యిచ్చారు. అయినా సరే ప్రమాదం జరిగితే ఈ సామ్రాజ్యవాద కంపెనీలకు ఎలాంటి బాధ్యతా లేకుండా ఒక చట్టాన్నే భారత ప్రభుత్వం చేసింది. అధిక లాభార్జనే ధ్యేయమైన ఈ సామ్రాజ్యవాద కంపెనీలకు చట్టరీత్యానే ఎలాంటి బాధ్యతా లేకుండా చేయటమంటే భరతమాత గుండెలమీద అగ్నిపర్వతాలనుంచటమే. దుర్ఘటనగా చిత్రించే భోపాలు విధ్వంసాలకు భారత ప్రజలను గురిచేయటమే. పరిశుభ్రశక్తి ఉత్పాదన పేరిట దేశాన్నేకాదు దక్షిణాసియా దేశాలన్నింటినీ తరతరాలకూ తరగని, విరుగుడులేని అణుకాలుష్య ప్రమాదంలోకి నెట్టడమే.

ఒకవైపున భారత అణురియాక్టర్ల భద్రతను పునస్సమీక్షస్తామంటూనే భారత ప్రధాని మన అణుకార్యక్రమం ప్రమాదరహితమని చెప్పటమూ, అదే సమయంలో మన అణుకేంద్రాలకూ, జపాను అణుకేంద్రాలకూ వున్న తేడాలను చెప్పి మనది ప్రమాదాతీతమని శాస్త్రజ్ఞులతో చెప్పించటమూ చూస్తే ఈ సమీక్ష ఫలితమేమిటో ఊహించటం కష్టమేమీ కాదు.

తరతరాలపాటు భారత ప్రజలను అణువిధ్వంసానికి గురిచెయ్యగల అణువిద్యుత్తు కార్యక్రమాన్ని పూర్తిగా ఆపివేయాలని డిమాండు చేయాలి.

పుస్తక సమీక్ష

# భారతదేశంలోని టెర్రరిజపు వాస్తవ రూపాన్ని బట్టబయలు చేసిన ఎస్.ఎం. ముష్రిఫ్

**అమెరికా** అధ్యక్షుడు ఒబామా మనదేశ సందర్శనకు రావటానికి ఒక నెలముందు కాలం నుండీ, భారతదేశం ఎదుర్కోబోతున్న టెర్రరిస్టు ప్రమాదం గురించి మన దేశపు మీడియాలో, జాతీయ దిన పత్రికలలో బహుళంగా ప్రచారం జరుగుతోంది. వార్తల రూపంలో చర్చల రూపంలో, వివిధ వ్యాసాల రూపంలో, రోజు విడిచి రోజు జాతీయ పత్రికలు సంపాదకీయాల రూపంలో ఈ టెర్రరిస్టు ప్రమాదాన్ని గురించీ, దీనికి వ్యతిరేకంగా పోరాడవలసిన తక్షణ ఆవశ్యకతను గురించీ హెచ్చరికలూ, ఉద్బోధలూ చేస్తున్నాయి.

ఒబామా పర్యటనకు ఒకనెల ముందు నుంచే అమెరికా ఆంతరంగికశాఖ నివేదిక పేరిట, అమెరికన్ కాంగ్రెస్ రిపోర్టుల పేరిట, అమెరికన్ గూఢచారి వర్గాల రిపోర్టుల పేరిట రాబోయే కాలంలో లష్కరే తోయిబా, జైష్-ఎ-మొహమ్మద్, హరికాతుల్- జిహదీ-ఇ- ఇస్లామీ- బంగ్లాదేశ్ లాంటి టెర్రరిస్టు సంస్థల వలన, భారతదేశం టెర్రరిస్టు ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నట్లు హెచ్చరికలు వెలువడుతున్నాయి.

భారతదేశాన్ని సందర్శించిన ఒబామా కూడా స్వయంగా మనదేశం టెర్రరిస్టు ప్రమాదంలో వుందని హెచ్చరించాడు. 26/11 నాటి ముంబయి ఘటనల పట్ల కన్నీరు కార్చాడు. నాటి ఘటనల్లో మరణించిన వారికి నివాళి సమర్పించాడు. నాటి ఘటనల సందర్భంగా ఎంతో ధైర్యంతో వ్యవహరించిన తాజ్ హోటల్ మేనేజర్ కాంగ్‌ను ప్రశంసించాడు. తాను తాజ్ హోటల్‌లో బస చేయట మన్నదే, టెర్రరిస్టులకు ఒక సవాలు అని ప్రకటించాడు. ముంబయి 26/11 దాడులను ప్రేరేపించిన వారిని పట్టుకొని శిక్షించాల్సిందేనని బల్లగుద్ది మరీ చెప్పాడు. ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో కలిసి చేసిన సంయుక్త ప్రకటనలో టెర్రరిజాన్ని అంతమొందించటానికి అమెరికా, భారతదేశాలు రెండూ కలిసి పని చేస్తాయని ఉద్ఘాటింప చేశాడు. ఇరు దేశాలూ ముంబయి దాడుల వెనుక వున్న ఉగ్రవాదులను శిక్షించాల్సిందిగా పాకిస్థాన్‌ను కోరతాయనీ, లష్కరేతోయిబా, తాలిబాన్‌లాంటి టెర్రరిస్టు గ్రూపులను మట్టుబెడతాయనీ, ఉమ్మడి భద్రతా వ్యవహారాలపై సహకరించుకొంటాయనీ ఆ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

భారతదేశానికి పర్యటనకు వచ్చిన ఒబామాను కలుసుకొన్న పార్లమెంటులోని ప్రతిపక్షనాయకురాలూ, బి.జె.పి. నాయకురాలూ అయిన సుష్మాస్వరాజ్ "26/11 ముంబయి దాడులను జరిపించిన దేశంగా పాకిస్థాన్‌ను అమెరికా స్పష్టంగా గుర్తించాలంటూ" విజ్ఞప్తి చేసింది.

26/11 ఘటనయొక్క ద్వితీయ వార్షిక సందర్భం అనబడే దాన్ని ముంబయిలో నిర్వహించి, ఆ సందర్భంగా "26/11 దాడికి ప్రేరకులయిన వారిని పాకిస్తాన్ శిక్షించలేదనీ, అటువంటి పొరుగు దేశం ప్రక్కన మనం వుంటున్నామనీ" హోంమంత్రి చిదంబరం ప్రకటించాడు.

అమెరికాలో కూడా 26/11 ఘటన యొక్క ద్వితీయ వార్షిక సందర్భంగా, అమెరికా విదేశాంగ మంత్రిణి హిల్లరీ క్లింటన్ ముంబయి దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తూ, తమ సంఘీభావాన్ని ప్రకటించింది.

అప్పటి నుండీ తరచుగా భారత విదేశాంగ మంత్రి క్రిష్ణ, విదేశాంగ కార్యదర్శి నిరుపమారావులు భారత-పాకిస్తాన్ సంబంధాల ప్రసక్తి వచ్చినప్పుడల్లా "26/11 ఘటన దోషులను పాకిస్తాన్ శిక్షించలేదు" అని ప్రకటనలను చేస్తూనేవున్నారు.

డిసెంబరు 1న, ఐక్యరాజ్య సమితి నిర్వహించిన "టెర్రరిజంపై న్యాయ నిపుణుల గ్లోబల్ సదస్సు" అన్న సదస్సుకు భారతదేశ ప్రతినిధిగా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి అయిన ఉజ్వల్ నికమ్ హాజరయివచ్చాడు.

డిసెంబరు నెలలో (5వ తేదీన) భారత పర్యటనకు వచ్చిన ఫ్రాన్సు అధ్యక్షుడు సర్కోజీ కూడా 26/11 నాటి ఘటనలో మరణించిన వారికి నివాళులర్పించాడు. దాడులు జరిపిన వారిని శిక్షించేదాకా, న్యాయంజరిగే వరకూ భారతదేశానికి మద్దతుగా వుంటానని ప్రకటించాడు. తాజ్ హోటల్ మేనేజరు కాంగ్‌ను, ఒబరాయి-ట్రైడెంట్ హోటల్ దేవేంద్ర బర్మాలను సత్కరించాడు. తమ దేశం నుండి పుట్టుకువస్తున్న టెర్రరిజంతో పోరాడటానికి దృఢనిశ్చయాన్ని చూపించాల్సిందిగా అతడు పాకిస్తాన్ ప్రభుత్వాన్ని కోరాడు.

డిసెంబరు 5న, అమెరికా విదేశాంగశాఖ ఒక కేబుల్‌ను పంపిస్తూ అందులో "గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీని చంపటానికి లష్కర్-ఎ-తోయిబా పథకం వేస్తున్నట్లు" తమకు అనేకమయిన గూఢచారి వర్గాల వివరాలున్నట్లు తెలియచేసింది. అయితే తమకు అటువంటి సమాచారం ఏ వర్గాల నుండి అందిందో మాత్రం తెలియపరచలేదు.

ఏమైనా టెర్రరిస్టు ప్రమాదం గురించి, భారతదేశానికి గల 'టెర్రరిస్టు ప్రమాదం' గురించి అమెరికా పదే, పదే హెచ్చరికలు పంపుతోంది. కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో లష్కర్-ఎ-తోయిబా నాయకుడు ఖపా ఏర్పాటు చేసిన నెట్‌వర్కు, శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్‌లోగల లష్కర్-ఎ-తోయిబాల మద్దతుతో, భారతదేశంలో దాడులు జరుపవచ్చునన్నది సారాంశం.

"భారత-ఐరోపా సమాఖ్య" శిఖరాగ్ర సభలో (డిసెంబరు) భారత దేశంతో కలసి టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలనే కృతనిర్ణయాన్ని పునరుద్ఘాటించటం అన్నది ఆ శిఖరాగ్ర సభ సాధించిన ప్రధాన విజయంగా ప్రచారం కావింపబడుతోంది.

డిసెంబరు 21న భారతదేశ పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ కూడా "26/11 ముంబై టెర్రరిస్టు దాడులకు పాల్పడిన నిందితులను పాకిస్తాన్ భారత్‌కు అప్పగించాల్సిందేనని, వారిని కఠినంగా శిక్షించాల్సిందేనని" ప్రకటించాడు. భారత ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో కలసి "పాక్‌లోని టెర్రరిస్టు నిర్మాణాలన్నింటినీ నిర్మూలించి తీరాల్సిందేనని" కూడా డిమాండ్ చేశాడు.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తాత్కాలిక ప్రాతిపదికపై రెండేళ్ళ పాటు శాశ్వత సభ్యత్వ హోదాను జనవరి 1వ తేదీన చేపట్టిన భారతదేశం, 26/11 ముంబయి దాడుల తరువాత లష్కర్-ఎ-తోయిబాకు చెందిన పలువురు పేర్లను, ఆ సంస్థ అనుబంధ సంఘాల పేర్లనూ-నిషేధిత వ్యక్తులు, సంస్థల జాబితాలో చేర్చమని భద్రతా మండలిని కోరి, ఆ జాబితాలో పేర్లను చేర్పించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడటం కోసం భద్రతా మండలి ఏర్పాటు చేసిన రెండు కమిటీలలో, ఒక కమిటీకి నేతృత్వం వహించేందుకు భారతదేశం ఉవ్విళ్ళూరుతోంది.

> 'హూ కిల్డ్ కర్కారే?' రచయిత ఎస్.ఎం. ముష్రిఫ్,
> ఫారోస్ మీడియా & పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్
> న్యూఢిల్లీ

ఈ రకంగా "టెర్రరిజం యొక్క ప్రమాదానికి గురవుతున్న దేశాలలో భారతదేశమే మొట్టమొదటి దేశమన్నట్టు ఒక భయంకరమైన 'హెచ్చరిక'తో భారత ప్రజలను ఊదరగొట్టి భయపెట్టడం అన్నది ఒక నిరంతరమైన ప్రక్రియగా సాగుతోంది. ఇందుకు 26/11 నాటి ముంబయి ఘటనను దేశప్రజల ముందూ-ప్రపంచం ముందూ ఒక అత్యంత భీభత్సపూరితమయిన కారణంగా చూపెట్టబడుతోంది. ఈ ప్రచారానికి భారతదేశంలోని ప్రధాన పాలకవర్గ పార్టీలయిన కాంగ్రెసు, బి.జె.పి.లు రెండూ తర, తమ స్థాయిల్లో వూతం యిస్తూ, ఎవరికి వారు తామే టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సిసలైన యోధులమన్నట్లు ప్రకటించుకొంటూ, ప్రచారం కావించుకొంటూ తమ, తమ ఓటు బ్యాంకు రాజకీయ అవసరాలకు అనుగుణంగా వారు ఈ 'టెర్రరిస్టు ప్రమాదం' అనబడేదాన్ని ఎంతో చాకచక్యంగా వాడుకొంటున్నారు.

9/11 దాడులతో ఖంగుతిన్న అమెరికన్ సామ్రాజ్యవాదం, తాను ప్రారంభించిన 'ముస్లిం టెర్రరిజంపై' యుద్ధానికి, భారతదేశాన్ని ముందుకు నెట్టి తద్వారా లాభం పొందాలనుకొన్న తన ఎత్తుగడను సమర్థవంతంగా నిర్వహించటంలో సఫలీకృతం కాగలుగుతోంది అని చెప్పటానికి యీ 'టెర్రరిస్టు ప్రమాద' ప్రచారం ఒక తిరుగులేని తార్కాణంగా మన ముందు వుంది.

"తాజ్ హోటల్‌లోని ఉద్యోగులు ప్రదర్శించిన ధైర్యసాహసాల"పై హార్వర్డ్ యూనివర్సిటీ ఒక అధ్యయనం జరిపిన దానిని గురించిన ప్రచారాన్ని బట్టి చూస్తే అమెరికన్ సామ్రాజ్యవాదులు 26/11 నాటి ముంబై ఘటనల వాస్తవాలతో నిమిత్తం లేకుండా, తాము కోరుకుంటున్న పద్ధతిలోనే 26/11 నాటి ఘటనల గురించి ప్రజాభిప్రాయం మలిచే ప్రక్రియను చేబట్టారని అర్థం చేసుకోవాల్సివస్తోంది.

మన దేశంలో మీడియాకూడా 26/11 నాటి ఘటన యొక్క వాస్తవాలతో నిమిత్తం లేకుండా, ఆనాటి ఘటనయొక్క మొత్తం వివరాలను తెలియబరచకుండా, తాను ఎంపిక చేసిన కొన్నింటినే పదే, పదే ప్రచారం కావిస్తూ, దేశ ప్రజల మనస్సులో వీలైనంత మేరకు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. అసలు ఈ టెర్రరిస్టులు ఎవరు? 26/11 ఘటనలలో అసలు సూత్రధారులూ, పాత్రధారులూ ఎవరు? అన్న విషయం అర్థంకాని విషయంగా మారి, దేశ ప్రజలు టెర్రరిస్టులెవరన్న విషయంలో అపార్థం చేసుకొనే విధంగా, పరిస్థితులు మలచబడ్డాయి.

ఈ కారణం రీత్యా ఆనాడు (26/11) ముంబయిలో జరిగిన ఘటనల వివరాలు తెల్సుకొంటే తప్ప, టెర్రరిస్టుల వాస్తవ స్వభావ స్వరూపాలను అర్థం చేసుకోవటం సాధ్యంకాదు.

ఈ విషయంలో మహారాష్ట్ర రాష్ట్ర మాజీ పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ అయిన, ఎస్.ఎం. ముష్రిఫ్, ఐ.పి.ఎస్. ఒక హేతుబద్ధమయిన పరిశోధన జరిపారు.

26/11 నాటి ముంబయి ఘటనల్లో, మహారాష్ట్ర టెర్రరిస్టు వ్యతిరేక స్క్వాడ్‌కు అధిపతిగావున్న హేమంత్ కర్కారే అనుమానస్పద పరిస్థితుల్లో 'టెర్రరిస్టుల' చేత చంపబడ్డారు. ఆయన్ను చంపిన 'టెర్రరిస్టులు' ఎవరు అన్నదానిపై-అధికారిక ప్రకటనలకు వ్యతిరేకంగా-పలు సందేహాలు వ్యక్తం కాబడ్డాయి. ఆయన అప్పటివరకూ 2008లో మాలెగావ్‌లో జరిగిన ప్రేలుళ్ళ కేసును దర్యాప్తు చేస్తూవున్నారు. నిష్పక్షపాతమైన తన దర్యాప్తు ద్వారా అప్పటి వరకూ భారతదేశంలో జరుగుతున్న వివిధ ప్రేలుడు ఘటనల వెనుకగల 'అసలైన టెర్రరిస్టు శక్తుల'ను గుర్తించి, వారిని చట్టం ముందుకు తీసుకువచ్చి శిక్షింపచేసే యత్నంలోవున్నారు. ఆయన మరణంతో ఆ మాలెగావ్ 2008 దర్యాప్తు మధ్యంతరంగానే ఆగిపోయి చేతులుమారింది. దేశంలోని 'అసలైన టెర్రరిస్టు' శక్తులను కనిపెట్టి వెల్లడి చేస్తున్న కారణంగానే అతడ్ని 26/11 ముంబయి దాడుల్లో చంపటం జరిగిందని పలువురు అనుమానాలను వ్యక్తం చేశారు. ఇలా అనుమానాన్ని వ్యక్తం చేసిన వారిలో మంత్రిపదవుల్లో వున్న నేతలూ వున్నారు. న్యాయవాదులూ వున్నారు. సాధారణ పౌరులూ వున్నారు.

ఈ నేపథ్యంలో మహారాష్ట్ర మాజీ ఐ.జి.పి. అయిన ముష్రిఫ్ నాటి జాతీయ పత్రికల్లో వెలువరింపబడిన వార్తలపైనా, తనకు పోలీసు అధికారిగావున్న దీర్ఘకాలిక అనుభవంపైనా, సామాజిక రంగంలోగల అనుభవంపైనా ఆధారపడి పరిశోధన జరిపి, ఆ పరిశోధన సారాంశంగా తేలిన తన నిర్ధారణలను 'కర్కారేను ఎవరు చంపారు' అనే పుస్తకం పేరిట 2009లో ప్రచురించాడు. ఈ రోజున ఒక దానితో ఒకటి సంబంధం లేకపోయినవే అయినప్పటికీ 'టెర్రరిజాన్ని' గురించి దర్యాప్తు సంస్థలు వెల్లడించే రకరకాల వివరాలు పత్రికల్లో, మీడియాలో వెలువడే వార్తలూ జాగ్రత్తగా గమనిస్తే నిష్పాక్షికంగా వాటిని బేరీజు వేయగలిగితే, 2009లోనే ముష్రిఫ్ చేసిన నిర్ధారణలన్నీ సహేతుకమైనవనే విషయం రుజువవుతోంది. ఇంతవరకూ ముసుగులో వుంచబడిన, ప్రజలకు రహస్యం వెల్లడికాకుండా ఉద్దేశ్యపూర్వకంగానే దాచిపెట్టబడిన అసలు టెర్రరిస్టులెవరో? వారి స్వభావ, స్వరూపాలేమిటో స్పష్టంగా అర్థమవుతోంది. ఈ అసలు టెర్రరిస్టుల గురించి దాచిపెట్టడం వెనుకగల వాస్తవ స్వభావం బోధపడుతుంది.

26-11-2008న ముంబయిలో జరిగిన టెర్రరిస్టుల దాడిలో రెండు ఉదంతాలున్నాయి. ఇవి రెండూ ఏక కాలంలోనే సాగాయి. అందువలన ఈ రెండు 'దాడుల' ఉదంతాన్నీ, ఒకే దాడిగా ప్రజలు భావించే విధమయిన గందరగోళానికి గురి చేయబడ్డారు. ఫలితంగా నేటికీ అసలు టెర్రరిస్టులను గుర్తుపట్టడంలో సాధారణ ప్రజలు విఫలం చెందుతున్నారు.

26/11 నాటి ముంబయి టెర్రరిస్టు దాడులలోని రెండు దాడుల ఉదంతం వివరాలు యిలాగున్నాయి.

1) హోటల్ తాజ్‌మహల్, కెఫె లియోపాల్డ్ మరియు నారిమన్‌హౌస్, ఓబరాయ్‌హోటల్, ట్రైడెంట్ హోటళ్ళపై టెర్రరిస్టుల దాడి జరిగిన ఉదంతం ఒకటి.

2) సి.ఎస్.టి. (ఛత్రపతి శివాజీ -రైల్వేస్టేషన్) కామా హాస్పిటల్-రంగాభవన్ సందులో టెర్రరిస్టులు దాడి జరిపిన ఉదంతం మరొకటి. రెండూ ఏక కాలంలోనే జరిగాయి.

మొదటి దాడి ఉదంతంలో ఆయా హోటళ్ళలో వున్న విదేశీయ అతిథులూ, వారి రక్షణకోసం అడ్డుపడిన ఆయా హోటళ్ళ ఉద్యోగులూ టెర్రరిస్టుల దాడికి గురయి మరణించటం గానీ, గాయపడటం కానీ జరిగింది. ఆ దాడి ఘటనల మర్నాడు మీడియా, వార్తా పత్రికలూ వెలువరించిన, ప్రసారం చేసిన కథనాల ప్రకారం, దాడి చేసిన టెర్రరిస్టులు కేవలం విదేశీయులపైననే (అమెరికన్లు, ఇజ్రాయిల్ పౌరులు, ఫ్రెంచి పౌరులు) దాడి చేశారు తప్ప, భారతదేశ పౌరులను ముట్టుకోకపోగా అక్కడ నుండి పొమ్మనీ, తమకు అడ్డుతగుల వద్దనీ, హెచ్చరికలు చేసినట్లు స్పష్టమవుతోంది. ఆ హోటల్స్‌లో దాడి జరిపిన టెర్రరిస్టులందరూ అక్కడికక్కడే పోలీసుల-టెర్రరిస్టు వ్యతిరేక దళాల-చేతిలో పూర్తిగా చంపబడ్డారు.

రెండవ దాడి ఉదంతంలో టెర్రరిస్టులు, సి.ఎస్.టిలోను, కామా ఆస్పత్రి-రంగాభవన్ సందులోనూ మారణకాండను సాగించారు. అనేక మందిని నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. ఈ ఉదంతంలో దాడి జరిపిన టెర్రరిస్టులు స్థానిక భాష అయిన మరాఠీలోనే మాట్లాడినట్లు ప్రత్యక్షసాక్షులు తెలియచేస్తున్నారు. ఈ రెండవ దాడి ఉదంతంలోనే హేమంత్ కర్కారే, మరో ఉన్నత పోలీసు అధికారి అయిన అశోక్ కామ్టే, విజయ సలాస్కర్‌లు చంపబడ్డారు.

మొదటి ఉదంతంలో టెర్రరిస్టులు అవలంబించిన దాడి పద్ధతులకూ, ప్రవర్తనలకూ రెండవ ఉదంతంలో దాడి జరిపిన టెర్రరిస్టులకూ, పద్ధతులకూ, ప్రవర్తనకూ ఎంతో భేదం వుంది. ఆ కారణం చేత ఈ రెండు దాడులూ ఒకే రకానికి చెందిన టెర్రరిస్టుల చేత నిర్వహింపబడలేదని అర్థమవుతోంది.

పాకిస్థాన్ వైపు నుండి రబ్బరు డింగీలో ముంబయి సముద్ర తీరంలోకి ప్రవేశించిన టెర్రరిస్టులే, తాజమహల్ హోటల్ నుండి ట్రైడెంట్ హోటల్ దాకా దాడి జరిపేరనీ, వారు అక్కడే పోలీసు బలగాల చేతిలో హతం కావింపబడ్డారన్నది నిస్సందేహమైన వాస్తవమే! అయితే ఈ టెర్రరిస్టులు లష్కరే తోయిబాకు చెందినవారా? లేక లష్కరే తోయిబా-పాకిస్తాన్‌కు చెందిన ఐ.ఎస్.ఐ.లు సంయుక్తంగా ఈ దాడులను నిర్వహింపచేశాయా? లేక మాఫియాడాన్ దావూద్ ఇబ్రహీం మద్దతుతో లష్కరే తోయిబా నిర్వహించిందా? లేక తాలిబాన్ లేదా ఆల్-ఖయిదాలు ఈ దాడులు జరిపాయా? అన్నది మాత్రమే తేలాల్సిన విషయం.

అయితే సి.ఎస్.టి, కామా ఆస్పత్రి, రంగాభవన్ సందులో మారణకాండ జరిపిన టెర్రరిస్టులు ఎవరన్న విషయం మాత్రం సందేహాస్పదంగా మిగిలింది. ఈ ఉదంతంలోనే కర్కారే, తదితరులు చంపబడ్డారు.

హేమంత్ కర్కారే 29 సెప్టెంబరు 2008న మాలెగావ్‌లో జరిగిన బాంబు విస్ఫోట ఘటనను దర్యాప్తు చేస్తున్నాడు. ఈ ఘటనలో 6 గురు మరణించారు, వందమందికి పైగా గాయపడ్డారు. యధా ప్రకారం ఈ బాంబుప్రేలుళ్ళు 'సిమి', 'ఇండియన్ ముజాహిద్దీన్' యొక్క పనే అంటూ ప్రచారం కావింపబడింది. కానీ నిష్పక్షపాతంగా, అత్యంత సమర్థతతో, ఏ ప్రభావానికీ, ఏ అధికారానికీ లోను కాకుండా దర్యాప్తు నిర్వహించిన హేమంత్ కర్కారే ఈ వాస్తవాలను కనుగొన్నాడు.

ఈ ప్రేలుళ్ళు ఎం.హెచ్. 15-4572 నెంబరుగల ఎల్.ఎం.ఎల్ మోటారు సైకిలుకు బిగించిన ఐ.ఇ.డి. (అభివృద్ధి పరచబడిన ప్రేలుడు సాధనం) వలన జరిగాయి. అయితే ఈ మోటారు సైకిలు నెంబరు అసలు నెంబరు కాదు. ఈ మోటారు సైకిలు విడిభాగాలు కూడా యితర మోటారు సైకిళ్ళకు చెందినవి. అయినా మోటారు డీలర్ల రికార్డుల సహకారంతో, ఫొరెన్సిక్ నిపుణులు కనుగొన్న వివరాలతో పోలీసులు సాధ్వి ప్రగ్యా సింగ్ చంద్రప్రతాప్ సింగ్ (38) అనే ఆమెను చేరుకున్నారు. అప్పటికి ఆమె గుజరాత్‌లోని సూరత్‌లో వుంటోంది.

(తరువాయి 4, 5 పేజీలలో)

కమాండ్‌కు తెలియచేయలేదు. అంతే కాకుండా ఈ సమాచారాన్ని ముంబయి పోలీసుశాఖకు కానీ, మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికికానీ తెలియచేయలేదు. ఈ సమాచారాన్ని పంపాల్సింది నేవల్ ఇంటిల్జెన్సుకు చెందిన ప్రధాన జాయింట్ డైరెక్టర్ అయిన ప్రభాకర్ అలోక్‌ని. తమకు అందించిన సమాచారంతో కోస్టల్‌గార్డు లష్కరేవారి ఓడకోసం సముద్రంలో వెతికింది. కానీ ఆ ఓడ ఎక్కడ వున్నదీ తెలుసుకోలేకపోయింది. వెంటనే కోస్టుగార్డు అధికారులు ప్రభాకర్ అలోక్‌ను, ఆఓడను గురించిన మరిన్ని వివరాలు పంపాల్సిందిగా కోరారు. అలోక్ అందుకు ఒప్పుకున్నా, ఆ వివరాలను మాత్రం పంపలేదు. మరో వైపు ఇంటిల్జెన్సు బ్యూరో కూడా ఈ సమాచారాన్ని పంపకపోవటమే కాక, 26/11 దాడులకు 5 రోజులు ముందుగానే టెర్రరిస్టుల మొబైల్ నంబర్ల గురించి తెల్సినా, వాటి సంభాషణ వివరాలపై నిఘా పెట్టకుండా–లేదా–వివరాలు తెల్సినా వాటిని మరొక అవుసరం కోసం వాడుకొంది, కర్కారేను చంపేదాకా ఆ విషయం పట్టించుకోలేదు–ఇలా ఎందుకు జరిగిందీ అనే విషయంపై నిష్పక్షపాతమయిన విచారణ జరిపితే యిది నిర్లక్ష్యం వలనగానీ, మరచిపోవటం వలనగానీ జరుగలేదనీ ఉద్దేశ్యపూర్వకంగానే జరిగిందనీ, యిందుకు బాధ్యులైన ప్రధాన ఉన్నత అధికారులుకూ, హిందూత్వవాద శక్తులకూ మధ్య సంబంధాలున్నాయని అర్ధమవుతుంది. అందువల్లనే ఏ వివరములు తెలియకుండా ఎ.టి.ఎస్. అధిపతి కర్కారే, ఈ దాడుల్లోకి నెట్టబడి, బలిచేయబడ్డారని అర్ధమవుతుంది. అంతేకాదు ఈ ఘటనల అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం వాటిపై విచారణకు ద్విసభ్యకమిషన్ అయిన ప్రధాన్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ ఇంటిల్జెన్సు బ్యూరోనూ, రా సంస్థను, వారు ఏ సమాచారాన్ని తెల్సుకొన్నారు, అందులో ఏ సమాచారాన్ని రాష్ట్రప్రభుత్వానికి అందించారో వివరాలు యిమ్మని అడిగింది. అయితే ఆ వివరాలు యివ్వటానికి ఇంటిల్జెన్సు బ్యూరో, రా సంస్థలు నిరాకరించాయి. దీన్ని బట్టి చూసినా ఈ సంస్థల్లో ప్రధాన ఉన్నతాధికారులు హిందుత్వ వాదులతో గట్టి సంబంధాన్ని కలిగి వున్నారని అర్ధమవుతుంది.

సి.ఎస్.టి. స్టేషన్‌లో సెక్యూరిటీ కెమెరాలు యిద్దరు టెర్రరిస్టుల ప్రతిబింబాలను రికార్డు చేశాయి. తర్వాతికాలంలో ఆ ప్రతిబింబాలు అజిమ్ అమీర్ కసబ్, అబుకేరా ఇస్మాయిల్ ఖాన్‌లవని గుర్తించినట్టు చెప్తున్నారు. సి.ఎస్.టి. స్టేషన్ లోపలగల 16 సి.సి.టి.వి. కెమెరాలు నవంబరు 26 రాత్రి 56 మందిని కాల్చి చంపిన సమయంలో అసలు పని చేయనే చేయలేదు. కానీ ఎక్కడో దూరంగావున్న కెమెరాలు పనిచేశాయి. ఆ 16 కెమెరాలేకాదు, ప్రయాణికులపై నిఘా కోసం వుంచబడ్డ (సి.ఎస్.టీలో) మరో రెండు కెమెరాలు కూడా సబర్బన్ స్టేషన్‌లోకి ప్రవేశించే, వాటినుండి వచ్చే ప్రయాణీకుల గేట్ల వైపుకి కాక ప్రయాణీకులు కూర్చునే హాలు వైపుకి త్రిప్పివుంచబడ్డాయని ఘటన అనంతరం15 రోజుల తర్వాత తెలియచేస్తున్నారు. కానీ ఘటన జరిగిన తర్వాతి రెండురోజుల్లో వెల్లడించిన సమాచారం ప్రకారం, సి.ఎస్.టి.లో పెట్టిన సి.సి.టి.వీ. కెమెరాలు, అక్కడ జరిగిన మొత్తం దాడి ఘటననంతా చిత్రీకరించాయి. వివరాలు చాలా స్పష్టంగా వున్నాయి. ఈ చిత్రీకరించిన భాగం అంతా రైల్వే అధికారుల ఆధీనంలో వుంది. ఈ రిపోర్టుల మధ్య వైరుధ్యాన్ని బట్టి చూస్తే, రైల్వే అధికారుల ఆధీనంలో వున్న నాటి ఘటన పూర్తి చిత్రీకరణకు చెందిన వివరాల టేపును "టాప్ సీక్రెట్ ఆపరేషన్" "అంతర్గత భద్రత", "అంతర్జాతీయ సంబంధాలు" అన్న మిషతో ఇంటిల్జెన్సు బ్యూరో స్వాధీనం చేసుకొని, వాటిలో వున్న అసలు వివరాలు బయట పడకుండా, సి.ఎస్.టీ.లోని 16 కెమేరాలు పనిచేయలేదనీ, కేవలం రెండు సెక్యూరిటీ కెమేరాలే పని చేశాయనీ, అవి అస్పష్టంగా ఆ ఘటన వివరాలను చిత్రీకరించాయని చెప్తున్నారని అర్ధమవుతోంది.

సి.ఎస్.టి.లో కాల్పులు జరిపిన యిద్దరు టెర్రరిస్టుల నుండి జారిపడిన రెండు సెల్‌ఫోన్ల గురించి దర్యాప్తు చేస్తే అందులో ఒక సెల్ ఫోనుకు చెందిన సిమ్‌కార్డు సతారాజిల్లాలోని కుంభర్వాడే తాలూకాకు చెందిన అశోక్ గోరేకి చెందినది. రెండవది సతారా జిల్లాకు చెందిన ఒక స్త్రీది –ఈ వివరాల్నిబట్టి చూస్తే సి.ఎస్.టి.లో కాల్పులు జరిపిన టెర్రరిస్టులు అజ్మల్‌కసబ్, ఇస్మాయిల్ ఖాన్‌లు కాదనీ, ఆ కాల్పులు జరిపిన టెర్రరిస్టులు మహారాష్ట్రతోనే సంబంధం కలిగిన వారని అర్ధమవుతుంది. విచిత్రం ఏమిటంటే ఈ వివరాన్ని 26/11 ఘటన రికార్డుల్లో, సి.ఎస్.టి.లో దొరికిన సెల్‌ఫోన్‌ల గురించి నమోదు చేయకపోవటం అన్నది.

2009, జనవరి 12 నాటి ముంబాయి క్రైంబ్రాంచి, ముంబాయి ఇంటిల్జెన్సుబ్యూరో వెల్లడించిన సమాచారం ప్రకారం, 58 గంటలపాటు టెరర్రిస్టుల దాడి జరిగింది. ఆ సమయంలో కాల్పులు జరిపిన టెర్రరిస్టులు, పాకిస్తాన్

**_మొదటి ఉదంతంలో టెర్రరిస్టులు అవలంబించిన దాడి పద్ధతులకూ, ప్రవర్తనలకూ రెండవ ఉదంతంలో దాడి జరిపిన టెర్రరిస్టులకూ, పద్ధతులకూ, ప్రవర్తనకూ ఎంతో భేదం వుంది. ఆ కారణం చేత ఈ రెండు దాడులూ ఒకే రకానికి చెందిన టెర్రరిస్టుల చేత నిర్వహింపబడలేదని అర్ధమవుతోంది._**

నుండి 284 ఫోన్‌కాల్స్ అందుకొన్నారు. అందులో 41 కాల్సు తాజ్ హోటల్‌లో కాల్పులు జరిపిన వారు అందుకొన్నారు. ఓబరాయి, ట్రైడెంట్ హోటల్స్‌లోని టెర్రరిస్టులు 62 కాల్సు, నారిమన్‌హౌస్‌లో వారు 181 కాల్సు అందుకొన్నారు. ఈ వివరాలన్నీ కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో పొందుపర్చారు. కానీ వీటిలో ఒక్క టెలిఫోన్ కాల్‌నుకూడా సి.ఎస్.టి. లో మారణకాండ సాగించి కర్కారే తదితరులను చంపినట్లు చెప్పబడే అజ్మల్ కసబ్, ఇస్మాయిల్‌ఖాన్‌లు అందుకోలేదు. అందువలన కసబ్, ఇస్మాయిల్‌ఖాన్‌లు పాకిస్తాన్ నుండి పడవపై వచ్చి, ముంబైలోని కఫే పేరేడ్‌లో దిగిన బృందంలోని వారు కారని అర్ధమవుతోంది.

సి.ఎస్.టి. నుండి వచ్చిన టెర్రరిస్టులు కామా ఆస్పత్రిలోని ఇద్దరు వాచ్‌మన్‌లను కాల్చిచంపారు. వారు మరాఠీ భాషను ధారాళంగా మాట్లాడుతున్నట్లు, ఆ టెర్రరిస్టులతో మాట్లాడిన మరో కామా ఆస్పత్రి ఉద్యోగి తెలియజేస్తున్నాడు. ఈ వివరాన్ని అతడు కామా ఆస్పత్రి అధికారులకూ, ఆరోగ్యశాఖ అధికారులకూ తెలియ చేశాడు. ఆ టెర్రరిస్టులు తామే అశోక్‌కామ్టేనూ, కర్కారేనూ చంపినట్లు చెప్పారు. దీన్ని బట్టి చూస్తే హేమంత్ కర్కారే, అశోక్ కామ్టేలను చంపింది 'దేశీయ టెర్రరిస్టు'లేకానీ కసబ్, ఇస్మాయిల్ కాదని అర్ధమవుతోంది. అంతేకాక ఆ టెర్రరిస్టులు హిందూవ్యతిరేకులు కూడాకాదని అర్ధమవుతోంది.

సి.ఎస్.టిలో పోలీసులచేత పట్టుకోబడినట్టు చెప్పబడుతున్న అజ్మల్ కసబ్, "తనను కేవలం తెల్లజాతి విదేశీ టూరిస్టులనే చంపమనీ ముస్లింలను వదిలిపెట్టమనీ ఆజ్ఞాపించారనీ, తానొక జిహాదీనని" చెప్పినట్లు పత్రికలు తెలియజేశాయి. తీరా చూస్తే సి.ఎస్.టి.లో చంపబడ్డ 52 మంది–వారిలో 6గురు పోలీసులు మిగిలిన 46 మంది పౌరులు. ఆ చంపబడ్డ పౌరుల్లో 22 మంది యించుమించు–సగం మంది ముస్లింలే. ఈ వివరాలను బట్టిచూస్తే సి.ఎస్.టిలో మారణకాండను సాగించింది జిహాదీలు ఎంతమాత్రం కాదని అర్ధమవుతోంది.

26/11 నాడు జరిగిన ఘటనల సందర్భంగా వైర్‌లెస్‌లో పోలీసు అధికారులు జరిపిన సంభాషణలను పరిశీలిస్తే, సీనియర్ అధికారి అయిన కె.పి. రఘువంశీ, ఇద్దరు టెర్రరిస్టులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దాటారని కర్కారేకు చెప్పినట్లు తెలుస్తోంది. నిజానికి ఆ టెర్రరిస్టులు అసలు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదికే రాలేదు. అటువంటప్పుడు కర్కారేకు అటువంటి అబద్ధం ఎందుకు చెప్పవల్సి వచ్చింది? ఆ వార్తను అనుసరించి కర్కారే, కామ్టే, మొహిత్, సలాస్కర్‌లు టైమ్స్ ఆఫ్ ఇండియా సందులోంచి ముందుకు వెళ్తుండగా కామా హాస్పిటల్ బిల్డింగ్‌నుంచి వారిపై ఒక గ్రైనేడ్ విసరబడింది. అప్పుడు వారిపై టెర్రరిస్టులు కాల్పులు జరిపారు. ఈ వివరాలను బట్టి చూస్తే, కర్కారే తదితరులను ఉద్దేశ్యపూర్వకంగానే ఆ సందులోకి పంపించి, వారు టెర్రరిస్టుల కాల్పులలో యిరుక్కొనేటట్లు చేసినట్లు అర్ధమవుతుంది.

సి.ఎం. ఫరూక్ అనే న్యాయవాది అజ్మల్‌కసబ్‌ను, భారతీయ పోలీసు ఏజెన్సీలు, 2006లో నేపాల్ అధికారుల తోడ్పాటుతో, నేపాల్‌లో అరెస్టు చేశారనీ, ఈ విషయమై తాను నేపాల్ సుప్రీంకోర్టులో ఒక దరఖాస్తు సమర్పించాననీ, అందులో భారతీయ హై కమీషన్‌ను ప్రతివాదిగా (నేపాల్ పోలీసులతోపాటు) పేర్కొన్నానని తెలియచేశారు. నేపాల్‌కు చట్టబద్ధమయిన వీసాతో వెళ్ళిన పాకిస్తానీయులను భారతీయ ఏజన్సీలు పట్టుకొని తర్వాతి కాలంలో వాళ్ళను ముంబయి ఘటనల్లాంటి ఘటనల్లో యిరికించటం ఒక అలవాటుగా మారిందని రావల్పిండి నుండి వెలువడే 'దిన్యూస్' అనే పత్రిక ఒక రిపోర్టులో ఆరోపించింది.

దీనినిబట్టి చూస్తే అజ్మల్ కసబ్‌ను అరెస్టు చేసిన నేపాల్ పోలీసులు, భారతదేశపు ఇంటిల్జెన్సు వర్గాలకు బదిలీ చేసి వుంటారనటానికి పూర్తి అవకాశం వుంది. అంతేకాక డింగీలో వచ్చి (పాకిస్తాన్ వైపు నుండి), బధ్వార్ పార్క్‌లో దిగిన ఆరుగురు టెర్రరిస్టుల బృందాన్ని ఉద్దాయియా అనే ఆ ప్రాంతంలో నివసించే అనితా రాజేంద్ర అనే ఒక మహిళ చూశారు. తిరిగి ఆమె చనిపోయిన ఆ ఆరుగురు టెర్రరిస్టుల మృతదేహాలను జె.జె హాస్పటల్‌లో గుర్తుపట్టారు. దీన్ని బట్టిచూస్తే సముద్రం వైపు నుండి వచ్చిన టెర్రరిస్టులందరూ చనిపోయారు. అందువల్ల అజ్మల్ కసబ్ 26/11 నాటి ఘటనలలో పాల్గొన్న టెర్రరిస్టులలోని వాడు కాదు. అజ్మల్‌కసబ్‌ను టెర్రరిస్టుగా గుర్తుపట్ట నిరాకరించిన కారణంచేత అనితా రాజేంద్రను ప్రాసిక్యూషన్ సాక్షిగా పేర్కొనకపోవటమేకాక, ఆమె దర్యాప్తు అధికారులను తప్పుదోవ పట్టించిందనే అబద్ధపు ఆరోపణతో ఐ.పి.సి. 182 సెక్షను క్రింద ఆమెను కేసులో యిరికించారు.

సి.ఎస్.టి.లో మారణకాండ జరిపిన యిద్దరు టెర్రరిస్టులలో ఒక టెర్రరిస్టుగా అజ్మల్ కసబ్ ఫోటో దిన పత్రికల్లో ప్రచురించబడింది. దాడి జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షిగావున్న ఒక ఫుడ్‌స్టాల్ మేనేజరు అయిన శశికుమార్‌సింగ్ "టెర్రరిస్టులు అరుస్తున్నారు. వారి ముఖాలు నల్లటి గుడ్డతో కప్పి వేయబడి వున్నాయి. అందువల్ల వారి మాటలుకూడా సరిగ్గా వినబడలేదు" అని పత్రికలకు చెప్పాడు.

దీన్ని బట్టి చూస్తే, అజ్మల్‌కసబ్ ఫోటోలను దర్యాప్తు ఏజన్సీనే పత్రికలకు అందించి ప్రకటింపచేసిందని అర్ధమవుతోంది. ఎందుకంటే పత్రికల్లో ప్రకటించిన అజ్మల్‌కసబ్ ఫోటోలను, అతడు సి.ఎస్.టి.లో కాల్పులు జరుపుతుండగా తీసినవని ఫోటోగ్రాఫర్లు చెప్తున్నారు. అదే నిజమైతే వారు తీసిన ఫోటోలో అజ్మల్‌కసబ్ ముఖం (లేదా ఆ టెర్రరిస్టు) కనబడ్డానికి వీలులేదు. ఎందుకంటే అది నల్లటి గుడ్డతో కప్పబడివుంది కనుక. అటువంటప్పుడు ఆ టెర్రరిస్టు అజ్మల్‌కసబ్ అని చెప్పటానికి వీలులేదు.

ఇకపోతే తాజ్, ట్రైడెంట్, ఓబెరాయ్ హోటల్‌లో 3 రోజులపాటు కాల్పులు జరిపిన టెర్రరిస్టు ఘటన అంతా సి.సి. కెమేరాలు స్పష్టంగా రికార్డు చేశాయి. ఆ పుట్‌వర్కు దర్యాప్తు ఏజెన్సీల వద్ద అందుబాటులోనే వుంది. అయినా విచిత్రం ఏమిటంటే ఈ రోజుదాకా కూడా, ఆ టెర్రరిస్టుల ఫోటోలను ప్రభుత్వం కానీ, ఇంటిల్జెన్సుబ్యూరోకానీ ప్రజలు చూడటానికి వీలుగా పత్రికలకు విడుదల చేయలేదు. సి.ఎస్.టి.లో పాల్గొన్నారన్న (16 సిసిటివీ కెమేరాలు పని చేయకపోయినా) వారి ఫోటోలు ప్రకటించి, వాస్తవంగా సి.సి. టీవీ కెమేరాలు పనిచేసి, టెర్రరిస్టుల ప్రతిబింబాలను రికార్డు చేసినా ఆ ఫోటోలు ప్రకటించక పోవటంలోని మతలబు ఏమిటి? దీనిని బట్టి కూడా అజ్మల్ కసబ్‌ను యిరికించటంకోసమే అతడి ఫోటోను (ఇంటిల్జెన్సువారు విడిగా తీసిన ఫోటోను) ప్రచురింపచేసినట్లు అర్ధమవుతుంది.

26/11నాటి సాయంత్రం గం.8.30 ని॥కు అనితా రాజేంద్ర మహాత్మాపూలేనగర్‌లో వున్న తన యింటికి సమీపంలో వున్న భద్వార్‌పార్క్ (కఫేపేరేడ్‌లోగల) వద్దగల ఒక ఖాళీ పడవలో కూర్చుని వుండగా, ఆమె 6గురు వ్యక్తులు ఎయిర్–బోటులో నుంచి దిగటాన్ని చూసింది. ఆమె వారిని మీరు ఎందుకు ఎవరూ సాధారణంగా రాని మార్గంగుండా వచ్చారని ప్రశ్నించింది. వారు ఆమెను భయపెట్టారు. 26/11 రాత్రినాటి టెర్రరిస్టుల భీభత్సం గురించి మర్నాడు తెల్సుకున్న ఆమె నవంబరున 27 ఇండియా టి.వి. యింటర్వ్యూలో తాను ముందురోజు చూసిన దాని గురించి చెప్పింది. ఆ టీ.వీ. ఇంటర్వ్యూ చూసిన ముగ్గురు విదేశీయులు (ఎఫ్.బి.ఐ. అధికారులు) ఆమెను 3 సార్లు ప్రశ్నించటమేకాక, తమకు వివరాలు సరీగ్గా చెప్పగలిగితే 5 లక్షల రూపాయలు యిస్తామని చెప్పి, ఆమెను అమెరికాలోని కోర్టు ముందుకు తీసుకెళ్ళటంకోసం 15 రోజులపాటు వివిధ వైద్య పరీక్షలు జరిపి, రహస్యంగా ప్రత్యేక విమానంలో అమెరికా తీసుకు వెళ్ళి, అమెరికాలోని ఒక కోర్టులో ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసి, తిరిగి ముంబయి తీసుకొచ్చి, ఒక హోటల్‌లో భోజనం పెట్టించి, చేతిలో 500 రూపాయలు పెట్టి ఒక టాక్సీ ఎక్కించి యింటికి పంపేశారు. తనతో మాట్లాడిన ముగ్గురు విదేశీయులకు, దుబాసీగా 'సుధాకర్' అనబడే ఒక భారతీయుడు వెంటవుండి పనిచేశాడు. ఈ వివరాల్ని నాటి దిన పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి.

ఈ వివరాలను బట్టి చూస్తే ప్రస్తుతం ఇంటిల్జెన్సు వర్గాలవారు చెప్తున్నట్లు డింగీలో 10 మంది టెర్రరిస్టులు ముంబయి చేరారన్నది అబద్ధమనీ, అనిత ఖచ్చితంగా తాను చూసిన టెర్రరిస్టులను గుర్తుపట్టగలిగిందనీ, వారందరూ 26/11 ఘటన క్రమంలో చనిపోయారనీ, ఆమెను అమెరికాకు ఎఫ్.బి.ఐ. వారు తీసుకెళ్ళి విచారించారనీ, ఆమె ఎఫ్.బి.ఐ., లేదా భారతీయ ఇంటిల్జెన్సుబ్యూరో చెప్పమన్న విధంగా చెప్పటానికి నిరాకరించినందుకు ఆమెను ప్రాసిక్యూషన్ సాక్షిగా పేర్కొనకపోవటమేకాక, ఆమెపై ఎదురు అబద్ధపు కేసును బనాయించారనీ అర్ధమవుతోంది. అంతేకాక మన స్వతంత్ర భారత దేశంలో అమెరికాకు చెందిన ఎఫ్.బి.ఐ.వారు నిరాటకంగా ప్రభుత్వం యొక్క సహాయంతో తమ గూఢచార కార్యకలాపాలను, తమకు అనుకూలవైన రీతిలో జరుపుకొంటున్నారని అర్ధమవుతుంది.

**_సి.ఎస్.టి..కామా ఆస్పత్రి, రంగాభవన్ సందులో మారణహోమం జరిపినవారు పాకిస్తాన్ వైపు నుండి డింగీలో ముంబైలో ప్రవేశించిన టెర్రరిస్టులు కారు. వీరు దేశ వ్యాపితంగా టెర్రరిస్టు పేలుళ్ళకు పాల్పడుతున్న హిందుత్వవాద శక్తులకు మద్దతుగా ఇంటిల్జెన్సు బ్యూరోలో వున్న ఉన్నతాధికారుల చేత కేవలం హేమంతకర్కారేని తుదముట్టించటం కోసమే ఏర్పాటు చేసి, నిర్దేశించబడి, మారణకాండను అమలు జరిపిన టెర్రరిస్టులు._**

**_సి.ఎస్.టి.లో కాల్పులు జరిపిన యిద్దరు టెర్రరిస్టుల నుండి జారిపడిన రెండు సెల్‌ఫోన్లు గురించి దర్యాప్తు చేస్తే అందులో ఒక సెల్ ఫోనుకు చెందిన సిమ్‌కార్డు సతారాజిల్లాలోని కుంభర్వాడే తాలూకాకు చెందిన అశోక్ గోరేకి చెందినది. రెండవది సతారా జిల్లాకు చెందిన ఒక స్త్రీది –ఈ వివరాల్నిబట్టి చూస్తే సి.ఎస్.టి.లో కాల్పులు జరిపిన టెర్రరిస్టులు అజ్మల్‌కసబ్, ఇస్మాయిల్‌ఖాన్‌లు కాదనీ, ఆ కాల్పులు జరిపిన టెర్రరిస్టులు మహారాష్ట్రతోనే సంబంధం కలిగిన వారని అర్ధమవుతుంది._**

ఈ పై వివరాలన్నింటినీ పరిశీలిస్తే యిలా జరిగి వుండటానికి ఆస్కారం వుందని భావించవచ్చును.

ప్రస్తుతం మన ఇంటిల్జెన్సు వర్గాలు వారు చెబుతున్నట్లుగా పాకిస్తాన్ వైపు నుండి ముంబయి సముద్రం ద్వారా డింగీలో చేరుకున్నవారు 10 మంది కాదు 8 మంది మాత్రమే. వారిలో భద్వార్‌పార్క్ దగ్గర దిగిన వారు ఆరుగురు. ఆ ఆరుగురూ తాజ్ హోటల్, కెఫెలియోపాడు నారిమన్‌హౌస్‌ల వద్ద భీభత్సాన్ని సృష్టించారు.

ఇద్దరు టెర్రరిస్టులు అదే డింగీలో ఓబరాయ్ హోటల్ వైపుకి వెళ్ళి, ఓబరాయ్ హోటల్ వద్ద, ట్రైడెంట్ హోటల్ వద్ద భీభత్సాన్ని సృష్టించారు.

సి.ఎస్.టి..కామా ఆస్పత్రి, రంగాభవన్ సందులో మారణహోమం జరిపినవారు పాకిస్తాన్ వైపు నుండి డింగీలో ముంబైలో ప్రవేశించిన టెర్రరిస్టులుకారు. వీరు దేశ వ్యాపితంగా టెర్రరిస్టు పేలుళ్ళకు పాల్పడుతున్న హిందుత్వవాద శక్తులకు మద్దతుగా ఇంటిల్జెన్సు బ్యూరోలో వున్న ఉన్నతాధికారుల చేత కేవలం హేమంతకర్కారేని తుదముట్టించటం కోసమే ఏర్పాటు చేసి, నిర్దేశించబడి, మారణకాండను అమలు జరిపిన టెర్రరిస్టులు. ఎందుకంటే కర్కారే హిందుత్వవాద టెర్రరిజాన్ని బట్టబయలు చేశారు. ఆర్.ఎస్.ఎస్. వి.హెచ్.పి. తదితర హిందుత్వవాద సంస్థలలోని కొందరు ముఖ్యమైన నాయకులను అరెస్టు చేసే క్రమంలో వున్నారు.

అందుకనే ఇంటిల్జెన్సు బ్యూరోలో హిందుత్వ వాదానికి మద్దతుగావున్న ఉన్నతాధికారులు, తమకు అందిన సమాచారాన్ని–టెర్రరిస్టులు ముంబాయిలోకి ప్రవేశిస్తున్నారు అన్న సమాచారాన్ని–ఉద్దేశ్యపూర్వకంగానే ముంబయి పోలీసులకు, మహారాష్ట్ర ప్రభుత్వానికీ, నౌకా దళ వెస్ట్రన్ కమాండుకూ అందించకుండా వున్నారు. అంతేగాక సరిగ్గా పాకిస్తాన్ నుండి వచ్చిన టెర్రరిస్టులు దాడి చేసే సమయంలోనే, సి.ఎస్.టి. నుండి మారణకాండ సాగించటానికి వీలుగా గతంలో నాగపూర్, పూణెలలో శిక్షణపొందిన హిందూత్వవాదయువకులతో 6 లేదా 8 మంది 'టెర్రరిస్టు' బృందంగా తయారు చేసిపంపారు. అబద్ధపు సమాచారం చెప్పి కర్కారేను సి.ఎస్.టి.–కామా ఆస్పత్రి సందులోకి పంపించారు.

కర్కారే మరణించిన మరుక్షణమే, మహారాష్ట్ర ఎ.టి.ఎస్. అధిపతిగా కె.పి. రఘువంశి (యితడే కర్కారేను అబద్ధపు సమాచారం చెప్పి, ఆ సందులోకి పంపించింది) నియమించటం, ఆనక ప్రమోట్ చేయటం చూసినా, కర్కారే దర్యాప్తు చేస్తూ ఆగిపోయిన మాలెగావ్ ప్రేలుళ్ళ దర్యాప్తు చేయటానికి అతడ్ని నియమించటాన్ని చూసినా పై నిర్ధారణలో భావించినట్లు జరగటానికి ఆస్కారముంది. మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రధాన కమిటీ యొక్క ప్యానల్ రిపోర్టును, తనకు సీల్డు కవరులో సమర్పించమని ముంబయి హైకోర్టు ఆదేశించినా, ఆ ఆదేశంపై మహారాష్ట్ర గవర్నమెంటు సుప్రీంకోర్టు నుండి స్టే తెచ్చుకునే ప్రయత్నం చేయటాన్ని బట్టీ, నేటికీ ఆ రిపోర్టు వివరాలు వెల్లడి కాకుండా దాచి పెట్టటాన్ని బట్టి కూడా, పై నిర్ధారణలు హేతుబద్ధమయిన వేనని భావించ వీలుంది. 26/11 ముంబై టెర్రరిస్టు దాడులపై ఎఫ్.బి.ఐ. అత్యుత్సాహం చూపించటం, మన దేశపు ఇంటిల్జెన్సు ఏజెన్సీలన్నీ ఎఫ్.బి.ఐ. సూచనల నిర్దేశకత్వం పైననే ఆధారపడి వుండటాన్ని బట్టి చూస్తే యిది మనదేశ సార్వభౌమత్వానికి ఎంతటి ప్రమాదమో అర్ధమవుతుంది.

(తరువాయి 6వ పేజీలో)

**భారతదేశం...** (5వ పేజీ తరువాయి)

హేమంత కర్కారే మరణంపై అనుమానాన్ని వ్యక్తం చేస్తూ దానిపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని నాడే మైనారిటీ వ్యవహారాల కేంద్ర మంత్రి ఎ.ఆర్. అంతూలే డిమాండ్ చేశారు.

అదేవిధంగా ముంబయికి చెందిన ఒక న్యాయవాది "ఎ.టి.ఎస్. అధిపతి హేమంత్ కర్కారే కొన్ని హిందుత్వ సంస్థల కార్యకర్తలను అరెస్టు చేశారు. అందువలన అతడ్ని హిందుత్వవాదులు చంపివుంటారనే అనుమానం కలుగుతోంది. కాబట్టి దీనిపై ఒక స్వతంత్ర విచారణ జరిపించమని" కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ముంబయి హైకోర్టులో వేశారు. అతడు కోరిన విధంగా విచారణ జరింపించవలసిందిగా ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

అటువంటి డిమాండ్ చేసినందుకు బి.జె.పి., శివసేన ఎం.పీలు పార్లమెంటులో గగ్గోలు చేశారు. అంతూలేను 'పాకిస్తాన్ ఏజెంటు'గా నిందించారు. ముంబయిలో అతడి దిష్టిబొమ్మను తగులబెట్టారు.

ఈ పరిశీలన సందర్భంలోనే భారతదేశ చరిత్రను పరిశీలించిన ముష్రిఫ్ హిందుత్వవాద టెర్రరిజం యొక్క పుట్టుక, మనుగడలను గురించి ఈ రకమయిన సహేతుక నిర్ధారణలను చేశారు :

ఈ రోజున బ్రాహ్మణవాదులు (హిందుత్వవాదులు) ఈ దేశం యొక్క, హిందూ మతం యొక్క రక్షకులుగా తమకు లేని అధికారాన్ని ప్రదర్శిస్తున్నారు. అది ఎలా జరిగిందో అన్నది తప్పకుండా తెల్సుకోవాల్సిన, అర్థం చేసుకోవాల్సిన విషయం. అయితే ఈ బ్రాహ్మణవాదులు (హిందుత్వవాదులు) బ్రాహ్మణ సెక్షనులో (హిందువులలో) చాలా తక్కువమంది వున్నారు. తాము బ్రహ్మనుండి పుట్టామనీ, అందరికన్నా ఉన్నతమైన కులస్థులమనీ ఆ కారణం చేత భారతదేశాన్ని శాశ్వతంగా పాలించటం కోసమే పుట్టించబడ్డవారమన్నట్టు వీరు భావిస్తారు.

చరిత్ర పరిశీలిస్తే బ్రాహ్మలు ఎన్నడూ ముస్లింలకు వ్యతిరేకంగా వుండలేదు. 1893 తర్వాత మాత్రమే వారు ముస్లింలకు వ్యతిరేకంగా మారారు. భారత దేశాన్ని పాలించిన 700 సంవత్సరాల ముస్లింపాలనలో, భారత సమాజంపై బ్రాహ్మల ఆధిపత్యం వున్నా వారు ముస్లిం పాలకులకు అణిగి మణిగి వుండే వారు. ఏంచేయమంటే అది చేశారు. మధ్యయుగాల నాటి భారతదేశంలో బ్రాహ్మలు సాధారణ హిందువులను ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగాకానీ చైతన్యపరచిన ఉదంతం మచ్చుకు ఒక్కటైనాలేదు. ముస్లిం పాలనను కూలద్రోసే ప్రయత్నాన్ని బ్రాహ్మలు ఎన్నడూ చేసిన దాఖలాలు లేవు. వాస్తవానికి ముస్లింపాలన సజావుగా, ఎటువంటి ఘర్షణలు లేకుండా సాగటానికి బ్రాహ్మణులు పాలనా వ్యవహారాల్లో తోడ్పడ్డారు. మొగల్ చక్రవర్తి 'నవరత్నాల'లో చాలామంది బ్రాహ్మణులే వున్నారు. టిప్పుసుల్తాన్ యొక్క ప్రధాన సలహాదారులూ, పాలనాధికారులూ కూడా బ్రాహ్మలే. ఔరంగజేబు దర్బారులో కూడా 50% మంది బ్రాహ్మణులే. ఆఖరుకు పూణెను పరిపాలించిన బ్రాహ్మణపెషావర్ల పాలనలో కూడా, ఆ రాజ్యంలో 30%పైగా ముస్లిం జనాభావున్నా ఒక్క మత ఘర్షణ జరిగినట్టుగానైనా చరిత్రలో నమోదు కాలేదు. పెషావర్ల కాలం హిందూ దళితులను అపవిత్రులనే పేరిట అంటరానివారుగానూ, అధములుగా పరిగణించినా, ముస్లింలను మాత్రం గౌరవంగానే చూశారు.

1857 మొదటి స్వాతంత్ర సంగ్రామ సందర్భంగా సాధారణ హిందువులు, బ్రాహ్మలు, ముస్లింలు మొగలు చక్రవర్తి బహదూర్ షాజఫర్‌ను తమ రాజుగా ప్రకటించి, ఆ సంగ్రామంలో ఐక్యంగా పోరాడారు. 19వ శతాబ్దాంతంలో అంటే 1893లోనే మత అల్లర్లు మొదలై, భారతదేశం పాకిస్తాన్, ఇండియాలుగా చీలిపోయే వరకూ కొనసాగి, యిప్పటిదాకా యింకా సాగుతూనే వున్నాయి.

19వ శతాబ్దపు ద్వితీయార్థంలో మహారాష్ట్రలోనూ, దక్షిణాదిరాష్ట్రాలలోనూ సంస్కరణ ఉద్యమం చెలరేగింది. బ్రాహ్మణవాద సామాజిక వ్యవస్థను మార్చటం అన్నది ఈ సంస్కరణ ఉద్యమపు లక్ష్యంగా వుంది. ఆ సంస్కరణ ఉద్యమం నుండి సాధారణ హిందువుల యొక్క దృష్టిని తప్పించటంకోసం బ్రాహ్మణ వాదులు (హిందుత్వవాదులు) ముస్లింలను ఒక ఎరగా వాడుకున్నారు. అదేవిధంగా ఎప్పుడైతే తమ స్థితికి ప్రమాదం కలిగిందో అప్పుడు బ్రాహ్మణవాదులు బౌద్ధ సన్యాసులను (బిక్షువులను) తరిమివేయటం, చంపివేయటం లాంటి వ్యూహాన్నీ ఎత్తుగడలనూ అనుసరించారు. మహారాష్ట్రలో 19వ శతాబ్దాంతానికి జ్యోతిరావుపూలే ఉద్యమం ప్రజలలో ఆదరణను పొందింది. అదేవిధంగా దక్షిణాదిన పెరియార్, తదితరులు మను ధర్మ నిర్దేశిత కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని చైతన్య పరచడంలో సఫలీకృతమయ్యారు. అందువలన ప్రజల దృష్టిని, సాధారణ హిందువుల దృష్టిని ప్రక్కదారి పట్టించటం కోసం హిందూ–ముస్లిం చీలికను సృష్టించారు. ఎం.ఎస్. గోల్వాంకర్ తన గ్రంధమయిన 'మనం–నిర్వచింపబడిన మన జాతి తత్వం'లో "తన జాతి యొక్కా, సంస్కృతి యొక్కా పవిత్రతను నిలబెట్టటం కోసం జర్మనీ తమదేశం నుండి సెమెటిక్ జాతుల వారినీ, యూదులనూ వెళ్ళగొట్టి ప్రక్షాళనం చేయటం ద్వారా ప్రపంచాన్ని దిగ్భ్రాంతి పరచింది. జాతి యొక్క గర్వం అనే దాని అత్యున్నత రూపం యిక్కడ వ్యక్తమయింది... ఇది హిందుస్థాన్‌లో వున్న మనం నేర్చుకోవాల్సిన, దాన్నుండి లాభం పొందాల్సిన ఒక మంచి పాఠం." అంటూ హిట్లరు అనుసరించిన ఫాసిస్టు జాత్యహంకార–జాతి వ్యతిరేక అమానుష పద్ధతులను ఆదర్శంగా లేవనెత్తుతూ, భారతదేశంలో మత ఘర్షణలను రెచ్చగొట్టారు. ఈ రకంగా సంస్కరణ ఉద్యమం నుండి సాధారణ హిందువుల దృష్టిని మళ్ళించటానికి ముస్లింలను ఎరచేసే వ్యూహాన్ని అనుసరించారు. 1925లో ఏర్పడ్డ ఆర్.ఎస్.ఎస్. ప్రధానంగా మీడియా, ఇంటిల్జెన్సు వ్యవస్థను తన ప్రభావం క్రిందకు తెచ్చుకొని తనకు అనుకూలంగా వాటిని మలుచుకొనే లక్ష్యాన్ని చేబట్టింది. ఎందుకంటే ఈ రెండు వ్యవస్థల ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయటం సాధ్యమవుతుంది కనుక. 1947 'స్వాతంత్రం' వచ్చే నాటికే ఈ రెండు కీలక సాధనాలపైనా తన పట్టును గణనీయంగా సాధించింది. ఈ వ్యవస్థలను వినియోగించి సాధారణ ప్రజల దృష్టిని దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యల నుండి మళ్ళించగలిగే స్థాయికి అన్ని ముఖ్యమైన సామాజిక, సాంస్కృతిక సంస్థలపై తన నియంత్రణ సాగించేస్థాయికి ఎదిగింది.

కాంగ్రెసు పార్టీకూడా అప్పుడప్పుడు 'కాషాయ టెర్రరిజం' లాంటి వాదనతో బి.జె.పి.నీ ఆర్.ఎస్.ఎస్.నూ కేవలం బ్లాక్ మెయిల్ చేయటానికి వాడుకొంటోంది తప్ప చిత్త శుద్ధితో హిందుత్వవాద టెర్రరిజాన్ని తుద ముట్టించేందుకు చర్యలు చేపట్టటంలేదు. కేవలం మెజారిటీ హిందువుల ఓట్లపై ఆధారపడి, అధికారాన్ని పొందటంకోసం పోటీ పడుతున్న ఈ రెండుపార్టీలూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ హిందుత్వవాద టెర్రరిజాన్ని అంగీకరిస్తూ, అది మరింత ఉధృతం అవటానికి తోడ్పడుతున్నారు.

ఆ రోజుల్లో విద్యపై బ్రాహ్మణవాదులదే గుత్తాధిపత్యం వుండటం వలన, జర్నలిజాన్ని (19వ శతాబ్దంలో) బ్రాహ్మలే చేపట్టారు. అందువలన ఆ బ్రాహ్మణ జర్నలిస్టులు, బ్రాహ్మణ వాదపు ప్రచారాన్ని ముందుకు తీసుకుపోవటంలో గణనీయమైన పాత్ర వహించారు. సాధారణ ప్రజల దృష్టిని ప్రక్కకు మరలించటంలో ముందుకు సాగారు, సాధారణ ప్రజలకు సరయిన సమాచారం స్థానంలో తప్పుడు సమాచారం అందించటంలో కృతకృత్యులయ్యారు.

మరోవైపు బ్రాహ్మణవాదులు, భారత ప్రభుత్వానికి కళ్ళూ, చెవులూ అయిన ఇంటిల్జెన్సు బ్యూరోలోకి కూడా ప్రవేశించారు. అధికార మార్పిడి జరిగిన పదేళ్ళలోగా, ఆ సంస్థపై బ్రాహ్మణవాదులు (హిందుత్వవాదులు) తమపట్టును సాధించారు. ఐ.బి.లో శాశ్వత ఉద్యోగులుగా వున్న వారిలో ముఖ్యమైన పదవుల్లోకి వీరు చేరారు. అదేవిధంగా రాష్ట్రాలనుండి డెప్యూటేషన్ మీద ఆర్.ఎస్.ఎస్. చేత ఆదేశింపబడ్డ ఆర్.ఎస్.ఎస్. అనుయాయులైన ఐ.పి.ఎస్. అధికారులూ ఇంటిల్జెన్సు బ్యూరోలో చేరారు. అదేవిధంగా ఆర్.ఎస్.ఎస్. అనుయాయులు రా(రిసెర్చి అండ్ అనాలసిస్‌వింగ్)లో ఉన్నతాధికారులుగా చేరారు.

వీరందరూ కలసి ప్రభుత్వానికి సరయిన సమాచారం యిచ్చేబదులు ఆర్.ఎస్.ఎస్.ను, దాని అనుబంధ సంస్థలను జాతీయవాద సంస్థలుగా చిత్రీకరించారు. వామపక్షవాదులను తిరుగుబాటు దారులుగా చిత్రీకరించారు. ముస్లింలను మత ఛాంధస వాదులుగానూ, టెర్రరిస్టులుగానూ, జాతీయవ్యతిరేక శక్తులుగాను చిత్రీకరించారు.

వీరు (ఇంటిల్జెన్సు సంస్థలోని హిందుత్వశక్తులు) ఆర్.ఎస్.ఎస్. యొక్క మతోన్మాద కార్యక్రమాల గురించి కానీ, దాని యొక్క అనేక అనుబంధ సంస్థల గురించిగానీ, దానికి విదేశాల నుండి వచ్చే భారీ ఎత్తు విరాళాల గురించి కానీ, అర్.ఎస్.ఎస్. కార్యకర్తలు భారీఎత్తున సామాజిక, విద్యా, సాంస్కృతిక సంస్థల్లోకీ, పత్రికలూ, ఎలక్ట్రానిక్ మీడియా లోనికి చొరబడిన విషయం గురించిగానీ, ప్రత్యేకించి వారు వ్యాప్తి చేస్తున్న మతోన్మాద విష ప్రచారం గురించి కానీ, ప్రభుత్వానికి తెలియచేయలేదు. మరోవైపు ముస్లిం సంస్థల కార్యకలాపాల గురించి ఎక్కువ చేసి చెప్పి, అబద్ధాలు చెప్పి, అవన్నీ తీవ్రవాద సంస్థలూ, టెర్రరిస్టు సంస్థలన్న అభిప్రాయాలను ప్రభుత్వానికి కల్పించారు.

వీరు (ఇంటిల్జెన్సు బ్యూరో ఉన్నతాధికారులు) తాము భారతదేశపు భద్రతనూ, పరువునూ కాపాడేపేరిట తమ యిష్టానుసారం వ్యవహరిస్తూ, తమ అపసవ్య కార్యకలాపాలకు ప్రధానమంత్రి కార్యాలయం యొక్క పూర్తి అనుమతిని పొందారు. రహస్య ఆపరేషన్లు, ప్రచ్ఛన్న ఆపరేషన్లు (కోవర్టు ఆపరేషన్లు), 'తిరుగుబాటు–వ్యతిరేక' ఆపరేషన్లు, టెర్రరిస్టు వ్యతిరేక ఆపరేషన్లు, 'అంతర్గత భద్రత', 'అంతర్జాతీయ సంబంధాలు' లాంటి కార్యకలాపాల పేరిట ఇంటిల్జెన్సు బ్యూరోను ఆక్రమించిన హిందుత్వవాదశక్తులు, ఆ సంస్థ కార్యకలాపాలను పారదర్శకంగా లేకుండా చేశాయి. అంతేకాక అధికార రహస్యాలచట్టం 1923 ఆసరాతో, యీ–ఉన్నతాధికారులు యితరులెవ్వరూ తమ కార్యకలాపాలను ప్రశ్నించకుండా అడ్డుకొన్నారు.

ఆ రకంగా ఇంటిల్జెన్సు వర్గాలలో, 'సంస్థలలో' మీడియాలో ఆధిపత్యం సాధించిన బ్రాహ్మణవాదశక్తులు (హిందుత్వవాదశక్తులు) ఆర్.ఎస్.ఎస్. చెప్పినట్లు ఆడి, ఆర్.ఎస్.ఎస్. దాని అనుబంధ సంస్థల యొక్క మతోన్మాద కార్యకలాపాలు, రేకెత్తించే మత ఘర్షణలను గురించి వాస్తవాలు ప్రభుత్వానికి వెల్లడించకుండా ఆ శక్తులు అనూహ్యస్థాయికి ఎదగటంలో తోడ్పడ్డారు.

మత ఘర్షణతో ప్రారంభించిన ఈ హిందుత్వవాద శక్తులు, యితర మతాల వారిపై అమానుష దాడులు జరపటం అనేది ఒక విధానంగా కొనసాగిస్తున్నారు. బాబ్రీమసీదును కూల్చటం ద్వారా, సాధారణ హిందువుల మనోభావాలను తమ కనుకూలంగా మలచుకొని రాజ్యాధికారాన్ని (బి.జె.పి.ద్వారా) పొందారు. గుజరాత్‌లో మోడీ నాయకత్వాన ముస్లింలపై మారణహోమం జరిపారు. ప్రస్తుతం తామే టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడుతూ, అవన్నీ ముస్లింలు జరుపుతున్నట్లుగా తమ అధీనంలోవున్న ఐ.బి. ద్వారా, మీడియాద్వారా అబద్ధపు ప్రచారం జరుపుతూ, మన దేశంలో టెర్రరిస్టులంటే ముస్లింలే అనే దురభిప్రాయాన్ని ప్రజలకు కల్పిస్తున్నారు. పేరుకు నిరంతరం పాకిస్తాన్‌ను నిందిస్తున్నా, ఆ నిందల ద్వారా టెర్రరిస్టు కార్యకలాపాలను సాగిస్తున్నది దేశంలోని ముస్లింలే అన్నట్టు అభిప్రాయం కల్గిస్తున్నారు. ఈ దురభిప్రాయాన్ని కల్పించటంలో ఇంటిల్జెన్సు బ్యూరో పూర్తిగా హిందుత్వవాద శక్తులకు తోడ్పడుతోంది. తనకు చేతనైన అన్ని రూపాల్లో సహకరిస్తోంది. ఎక్కడ టెర్రరిస్టు ఘటన జరిగినా, కనీసపు విచారణ కూడా జరుపకుండా, అది ముస్లిం టెర్రరిస్టుల ఘటనే అనే అభిప్రాయం ఏర్పడేటట్టుగా మీడియాకు సమాచారాన్ని విడుదల చేసి వాస్తవాలను మరుగు పరుస్తున్నారు.

ఇటువంటి నేపథ్యంలో 2008 మాలెగావ్ ప్రేలుళ్ల కేసు దర్యాప్తు చేసిన ఎ.టి.ఎస్. అధిపతి హేమంతకర్కారే ఈ ప్రేలుళ్ళ ఘటనల్ని యించుమించుగా హిందుత్వవాద టెర్రరిస్టులు జరిపినవేనన్న వాస్తవాన్ని సాక్ష్యాధారాలతో బయట పెట్టి వెల్లడి చేస్తుండటంతో, ఆయన్ను, ఈ హిందుత్వవాద శక్తులే 26/11నాటి టెర్రరిస్టు ఘటనల్లో సి.ఎస్.టి. కామా ఆస్పత్రి–రంగాభవన్ వీధిలో చంపారన్న విషయాం ముష్రిఫ్ తన పుస్తకంలో తేల్చారు.

దేశంలో బ్రాహ్మణవాద (హిందుత్వవాద) టెర్రరిజం నిరాఘాటంగా పెరగటానికీ ప్రధాన బాధ్యత ఇంటిల్జెన్సు బ్యూరోదిగానూ, హేమంత కర్కారేని చంపింది కూడా ఇంటిల్జెన్సు బ్యూరో అధికారుల పధకమేనంటూ ఆయన తన పుస్తకంలో నిర్ధారించారు.

ఇటీవల వెల్లడవుతున్న అనేక వివరాలను బట్టి చూస్తే కర్కారేను చంపింది, హిందుత్వవాద టెర్రరిస్టులేననే నిర్ధారణ సరయినదే నని అర్థమవుతోంది. అసిమానంద, పురోహిత్, సాధ్విప్రగ్యల వాంగ్మూలాలను బట్టి హిందుత్వవాద టెర్రరిజం మన దేశంలో పాతుకు పోయిందని అర్థమవుతోంది.

ఒరిస్సా, కర్నాటకలలో చర్చిలపై దాడి, స్టెయిన్స్ హత్య, గుజరాత్‌లో ముస్లింలపై మారణకాండ, బాబ్రీ మసీదు కూల్చడం–యివన్నీ హిందుత్వవాద టెర్రరిజానికి తిరుగులేని తార్కాణాలు. గోవాలో ప్రేలుళ్ళు, మాలెగావ్ ప్రేలుళ్ళు, మక్కా మసీదు ప్రేలుళ్ళు, నాందేడ్ ప్రేలుళ్ళు యివన్నీ హిందుత్వ వాద తీవ్రవాదుల చర్యలే.

ఈ విషయాలను వెల్లడించకుండా యిప్పటికే ప్రభుత్వమూ, ఇంటిల్జెన్సు వర్గాలవారూ, మీడియా ఆఖరుకు సామ్రాజ్యవాద దేశాధిపతులూ 26/11 నాటి ఘటనలకు న్యాయం చేయాలనే పేరిట, తాజ్–ఓబెరాయ్–ట్రైడెంట్ హోటల్స్‌పై జరిపిన దాడిగురించి పెద్దది చేసి చూపిస్తూ అమెరికన్ సామ్రాజ్యవాదులు 9/11 ఘటన అనంతరం ముస్లిం టెర్రరిజానికి వ్యతిరేకంగా ఎంచుకొన్న పెద్దటెర్రరిస్టు వ్యతిరేక యుద్ధంలోకి భారత దేశాన్ని ఈడ్చి ముందునిలబెడ్తున్నారు. 1947 నుండీ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న భారత పాలక వర్గాలను, యిప్పుడు అందుకు సాధనంగా వాడుకుంటున్నారు.

నిజానికి తాజ్‌మహల్, ఓబెరాయి, ట్రైడెంట్ హోటల్స్‌లోకి వచ్చి నివసించే తెల్లజాతి 'అతిధు'లందరూ మర్యాదస్తులుకారు. వారిలో వివిధ సంస్థలకు చెందిన గూఢచారులు, డ్రగ్స్ మాఫియా, నకిలీ కరెన్సీ చలామణీ చేసేవారు, అక్రమ ఆయుధ వ్యాపారం సాగించేవారు, రకరకాల కరుడుగట్టిన నేరస్తులు ఎక్కువ సంఖ్యలో వుంటారన్నది చాలా మంది భారతీయులకు తెలియని విషయం.

మెల్‌బోర్న్‌లో పుట్టిన కరుడు గట్టిన నేరస్తుడయిన గ్రిగరీ రాబర్ట్స్ అనే వ్యక్తి తమదేశపు జైలు నుండి తప్పించుకొని, భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించి, భారతదేశంలో (ముంబయి మహారాష్ట్రలలో) 10 సంవత్సరాలకుపైగా నేరస్థ కార్యకలాపాలు సాగించి, ఆఫ్ఘనిస్తాన్‌లోకి ప్రవేశించి అక్కడి తిరుగుబాటుదారులకు ఆయుధాలు అమ్మి, అనంతరం భారత దేశంనుండి పారిపోయి, 1990లో జర్మనీలో పట్టుబడి, తదుపరి ఆస్ట్రేలియాకు పంపబడి, అక్కడ జైలుశిక్షను పూర్తి చేసిన అనంతరం, రచయితగా మారి 'శాంతారాం' అనే నవలపేరిట తన స్వీయకథను 1000 పేజీల గ్రంధంగా ప్రచురించాడు. ఇందులో ముంబయి ట్రైడెంట్, ఓబెరాయ్, తాజ్‌లలో నివసించే తెల్లజాతి 'అతిధుల' వాస్తవ స్వభావ, స్వరూపాలు మనకు అర్థమయేలా వివరించాడు.

అటువంటి నేరస్థులైన తెల్లజాతి అతిధులుండబట్టే తాజ్, ఓబెరాయ్, ట్రైడెంట్ హోటళ్ళపై 26/11న ముంబయి ఘటనల్లో, సముద్ర మార్గంనుండి ప్రవేశించిన తీవ్రవాదులు కేవలం తెల్లజాతివారిపైనే దాడి జరిపి వారిని చంపారు. ఇప్పుడు ఆ ఘటనను పెద్దది చేసి చూపిస్తూ, న్యాయం జరగాలంటూ, భారతదేశాన్ని, పాకిస్తాన్‌పై కాలుదువ్వమని ప్రేరేపిస్తున్నారు. హిందూత్వవాద సంస్థ అయిన బి.జె.పి. కూడా పాకిస్తాన్‌నే నిందిస్తూ, భారతదేశంలో గల హిందుత్వవాద టెర్రరిజం యొక్క గుట్టు బయటపడకుండా, ప్రజాభిప్రాయాన్ని ప్రక్కదారి పట్టించే కార్యకలాపాలకు పాల్పడుతోంది. అఫ్జల్ గురు, కసబ్‌ల మరణశిక్షను తక్షణం అమలుజరపాలనే డిమాండుతో దృష్టి మళ్ళిస్తోంది. అదే సందర్భంలో ఒరిస్సాలో స్టెయిన్స్‌ను (క్రిష్టియన్ మిషనరీ) చంపిన ధారాసింగ్ గురించికానీ, గుజరాత్‌లో మారణహోమం జరిపిన మోడీ గురించికానీ ప్రస్తావించదు. ప్రజల దృష్టిని మళ్ళించటానికీ, అధికారంలోవున్న కాంగ్రెసు పార్టీని బ్లాక్ మెయిల్ చెయ్యటానికీ, అవినీతి వ్యతిరేక ఆందోళననూ, పాకిస్తాన్‌తో గట్టిగా పోరాడటల్లేదనే వాదననూ చేస్తూ, అసలు రహస్యం బయటపడకుండా చేస్తోంది.

మరోవైపు కాంగ్రెసు పార్టీకూడా అప్పుడప్పుడు 'కాషాయ టెర్రరిజం' లాంటి వాదనతో బి.జె.పి.నీ ఆర్.ఎస్.ఎస్.నూ కేవలం బ్లాక్ మెయిల్ చేయటానికి వాడుకొంటోంది తప్ప చిత్తశుద్ధితో హిందుత్వవాద టెర్రరిజాన్ని తుద ముట్టించేందుకు చర్యలు చేపట్టటంలేదు.

కేవలం మెజారిటీ హిందువుల ఓట్లపై ఆధారపడి, అధికారాన్ని పొందటంకోసం పోటీపడుతున్న ఈ రెండుపార్టీలూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ హిందుత్వవాద టెర్రరిజాన్ని అంగీకరిస్తూ, అది మరింత ఉధృతం అవటానికి తోడ్పడుతున్నారు.

ఇటీవలనే ప్రధాని మన్మోహన్ 'మతవాద టెర్రరిజం' యిప్పుడిప్పుడే పుట్టుకొస్తోంది అని చెప్పటాన్ని బట్టీ, సీమాంతర ఉగ్రవాదమే ప్రమాదకరమైనది అని వాదిస్తూ వుండటాన్ని బట్టీ చూస్తే, అధికారంలో వున్న కాంగ్రెసుపార్టీ కూడా హిందుత్వవాద టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడటానికి యిష్టపడట్లేదనీ, కేవలం తన ప్రత్యర్థులైన బి.జె.పి., ఆర్.ఎస్.ఎస్., శివసేన లాంటి వారిని బ్లాక్ మెయిల్ చేసేందుకే మతవాద టెర్రరిజం అన్న అంశాన్ని లేవనెత్తుతోందనీ, ఆ సాకుతో తిరిగి ముస్లింలనే కక్ష సాధింపులకు గురి చెయ్యాలనే యత్నంలో వుందనీ అర్థమవుతుంది.

అయితే యిది కేవలం కాంగ్రెసు, బి.జె.పి. పార్టీలకు చెందిన సమస్య మాత్రమే కాదు. వారిద్దరూ ఈ విషయంలో సంతృప్తి చెందితే, రాజీపడితే సరిపోదు. ఇది భారత ప్రజలు–భారతజాతి మొత్తంగా ఎదుర్కొంటున్న ప్రమాదం. అందువలన మన దేశంలోని అసలు టెర్రరిజం యొక్క స్వభావ, స్వరూపాలను దేశప్రజలు విస్పష్టంగా అర్థం చేసుకొని, ఈ తీవ్రవాద ప్రమాదాన్ని ప్రతిఘటించేందుకు పూనుకోవల్సివుంటుంది.

ఇందుకు బ్రాహ్మణవాద (హిందుత్వవాద) టెర్రరిజం యొక్క స్వభావ, స్వరూపాలను స్పష్టంగా అర్థం చేసుకోవటానికి ఎస్.ఎం. ముష్రిఫ్ రాసిన 'కర్కారేను ఎవరు చంపారు?' అన్న ఈ పుస్తకం ఎంతగానో తోడ్పడుతుంది. ✡

# ప్రజల జీవితాలని, పచ్చని పంటపొలాలని కాలుష్య విషకోరలకు బలిచేస్తున్న బల్క్‌డ్రగ్ పరిశ్రమలు

**కృష్ణాజిల్లా** జగ్గయ్యపేట మండలం ముక్త్యాల– నల్గొండజిల్లా, మేళ్ళచెరువు మండలం, దొండపాడు గ్రామాల సరిహద్దుల్లో పచ్చని పంట పొలాల మధ్యలో వివిన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బల్క్‌డ్రగ్స్ పరిశ్రమని 59.50 ఎకరాలలో నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

వాస్తవానికి ఈ పరిశ్రమకోసం సేకరించిన భూమి బోర్లు కింద సాగవుతున్న వ్యవసాయ భూమి. కాగా పర్యావరణ ప్రభావ నివేదికలో ఈ భూములు ఎందుకూ పనికిరానివనీ, పోరంబోకు భూమి (Barren Land) అనీ పేర్కొన్నారు. అదే నివేదికలో మరోచోట నీటి వనరుల్లేని మెట్టభూమి (Dryland) అనీ పేర్కొన్నారు. కానీ అమ్మకపు ఒప్పందంలో వ్యవసాయభూమి అని స్పష్టంగా ఉంది. ద్రాక్ష, జామ, మామిడి మొ॥ పండ్లతోటలు పెంచడం అనే పేరుతో భూమిని కొనుగోలు చేశారు. అంతేకాదు కంపెనీ ప్రకటించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక ఇంకా అనేక అవాస్తవాలతో కూడుకొని వుంది. పర్యావరణ ప్రభావ అంచనా నిమిత్తం అధ్యయనం కొరకు ముక్తేశ్వరపురం; కె.అగ్రహారం; జయంతిపురం; రావిరాల; వేదాద్రి గ్రామాలను మాత్రమే ఎంచుకున్నారు. పరిశ్రమ స్థాపించే స్థలంనుండి కేవలం 1 నుంచి 3.5 కి.మీ మధ్య దూరంలో ఉన్న ముక్త్యాల శివారు అయిన రామకృష్ణాపురం, శ్రీనివాసానగర్ గ్రామాలను; నల్లగొండ జిల్లాలోని దొండపాడు, వజినేపల్లి, బుగ్గమాధవరం గ్రామాలను అధ్యయనంనుంచి మినహాయించారు. పైన పేర్కొన్న గ్రామాల్లో సుమారు 40,000 మంది ప్రజలు నివశిస్తున్నారు. మొత్తం జనాభాలో అత్యధికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయంపైన ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో ఎక్కువశాతం పేద, సన్న, చిన్నకారు రైతులే, ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లో సుమారు 400మంది మత్స్యకారులు చేపలవేటపై ఆధారపడి బ్రతుకుతున్నారు. ఇంకా ఇతర వృత్తులవారు నివశించుతున్నారు. పై గ్రామాల్లో పత్తి, మిర్చి, కంది, కూరగాయలు పంటలను బోర్లమీద ఆధారపడి పండిస్తున్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఈ పరిశ్రమను ఏర్పాటువలన కలుగు పర్యావరణ కాలుష్య సమస్యలు రైతాంగం, ఇతర ప్రజానీకంలో, వారి జీవన విధానంలో ఏ విధమైన దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయో ఎక్కడా పేర్కొనలేదు. అలాగే పరిశ్రమనుంచి కృష్ణానది 2 కి.మీ. దూరం మాత్రమే ఉండగా నివేదికలో 18.75 కి.మీ. దూరం అని పేర్కొన్నారు. పరిశ్రమ పరిసరాలలో చారిత్రక కట్టడాలు, రిజర్వు ఫారెస్టు, చెరువులు, వన్యప్రాణులు లేవని కూడా నివేదికలో పేర్కొన్నారు. కానీ కె.అగ్రహారం పరిధిలో సుమారు 5వేల ఎకరాల రిజర్వు ఫారెస్టు ఉంది. అలాగే వేదాద్రి సమీపంలో కూడా అటవీ భూమి ఉన్నది. ఈ అటవీ ప్రాంతంలో నెమళ్ళు, జింకలు, అడవి పందులు లాంటి వన్య ప్రాణులున్నాయి. దక్షిణకాశీగా పేరుపొందిన ముక్తేశ్వర ఆలయం, ముక్త్యాలకోట; వేదాద్రిలో నరసింహస్వామి ఆలయం ఉన్నాయి. అలాగే నీటి చెరువులు లేవని పేర్కొన్నారు. కానీ, ముక్త్యాల గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో 'పాసికుంట' అనే చెరువు ఉంది. ఈ పరిశ్రమకి రోజుకు కావాల్సిన 128.40 ఘనపుటడుగుల నీటిని ఎక్కడనుంచి తీసుకుంటారో పేర్కొనలేదు. భూగర్భ జలాలనుంచి తీసుకుంటే చుట్టుప్రక్కల పొలాల్లో బోర్లమీద ఆధారపడి సాగు చేసుకునే రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. బల్క్‌డ్రగ్స్ పరిశ్రమవలన కలిగే కాలుష్య ప్రభావం ఏమాత్రం లేదని, దాని తీవ్రతను తగ్గించి చూపించే ప్రయత్నం చేశారు.

వాస్తవానికి పర్యావరణ ప్రభావ అంచనా నివేదికను ప్రభుత్వ సంస్థ అయిన జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ చేత అధ్యయనం చేయించి రూపొందించాలి. కానీ రైట్ సోర్సు, సొల్యూషన్ ప్రై లిమిటెడ్ హైద్రాబాద్ అనే ప్రైవేటు లాబోరేటరీ వారిచేత ఈ నివేదికను యాజమాన్యం తయారుచేయించింది.

వివిన్ లేబొరేటరీస్ బల్క్‌డ్రగ్స్ పరిశ్రమనుంచి ఎమిడోరోన్ హైడ్రో క్లోరైడ్, బుపురోపిన్ హైడ్రో క్లోరైడ్, క్లోపిడోగ్రిల్ హైడ్రోక్లోరైడ్, మెటోమైడేట్ హైడ్రోక్లోరైడ్ వంటి 16 రకాల బల్క్‌డ్రగ్స్‌ను నెలకు 52.50 మెట్రిక్ టన్నులు చొ॥న ఉత్పత్తి చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో వ్యర్థపదార్థాలు, ప్రమాదకరమైన వ్యర్థాలు, వ్యర్థ జలాలు, రసాయనిక వాయువులు పరిశ్రమనుంచి వెలువడుతాయి. ఈ వ్యర్థపదార్థాలు, నిల్వలు పేరుకుపోయినప్పుడు–వీటిని ప్రమాద రహితంచేసి భూమిలోకి పంపిపూడ్చటం జరగుతుంది. ఈ పనిచేయటంకోసం హజార్డస్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ అనే వేరొక పరిశ్రమతో వివిన్ లేబొరేటరీస్ యాజమాన్యం ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించారు. ఒప్పందం చేసుకున్న పరిశ్రమ సరిగా శుద్ధిచేయకపోయినా, ప్రమాదకరమైన వ్యర్థపదార్థాలను మూటగట్టి భూమిలో పూడ్చిన కొంతకాలానికి అది పగిలిపోతే వెలువడే ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాలవలన భూమి, భూగర్భజలాలు విషతుల్యమౌతాయి.

అలాగే ప్రమాదకరమైన లోహాలు గ్రీజు, ఆయిలు రసాయనాలతో కూడిన వ్యర్థజలాలను గుంటతవ్వి నిల్వచేస్తారు. సల్ఫర్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, లెడ్(సీసం), పాదరసం వంటి ప్రమాదకరమైన రసాయనక వాయువులను గాలిలోకి విడిచిపెడతారు. దీనివలన నేల స్వభావం మారిపోయి, భూసారం నిర్వీర్యం అవుతుంది. భూగర్భ జలాలు విషతుల్యం అవుతాయి. శ్వాసకోశవ్యాధులు, గుండెజబ్బులు, ఎముకలు పెళుసు బారటం, కీళ్ళ నొప్పులువంటి తీవ్ర అనారోగ్యాలు కలుగుతాయి. ఈ పరిశ్రమని నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలందరూ ఈ ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొనక తప్పదు.

ఇప్పటికే తమ పొలాల ప్రక్కనే సుమారు 10 సం॥క్రితం నిర్మించిన ఆర్ఎ కేఎమ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో నడుస్తున్న ఫార్మా కెమికల్ పరిశ్రమ వలన చుట్టుప్రక్కల రైతులు, ప్రజలు భయంకరమైన అనుభవాలను పొందారు. ఈ పరిశ్రమను నిర్మించే ముందు జరిపిన ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో కూడా అనేకమందికి ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని, ఫ్యాక్టరీనుంచి కాలుష్యాన్ని రానీయకుండా ఎంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని ఘనంగా ప్రకటించారు. రైతాంగం, ప్రజలు నిజమని నమ్మారు. ఇప్పుడు ఈ పరిశ్రమనుంచి వెలువడుతున్న కాలుష్యపు రసాయనిక వాయువుల వలన చుట్టుప్రక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు, కూలీలు తీవ్రమైన తలనొప్పులకు, ఒళ్ళునొప్పులకు, వికారాలకు గురి అయి ఒకసారి పనిచేసేందుకు వస్తే మరోసారి రావటానికి భయపడుతున్నారు. అంతేకాక వ్యర్థ పదార్థాలను, పరిశ్రమనుంచి వెలువడే వ్యర్థ కాలుష్య జలాలను శుద్ధిచేయాల్సి వుండగా– దీనికోసం ఖర్చు చేయడానికి యాజమాన్యం పూనుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా రసాయనిక వ్యర్థ కాలుష్య జలాలను భూమిలోపల లోతుగా నిల్వచేయటంతో చుట్టుప్రక్కల పొలాలలోని భూగర్భ జలాలు కాలుష్యానికి గురై ప్రజలు, పశువులు తాగటానికి, వ్యవసాయానికి కూడా పనికిరాకుండా పోయాయి. ఇటువంటి భయంకరమైన అనుభవాలను చవిచూసిన రైతాంగం ఇప్పుడు సరికొత్తగా తమ పంట పొలాలకు ఆనుకొని నిర్మించబోతున్న వివిన్ లేబొరేటరీస్ వారి బల్క్‌డ్రగ్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారు.

ఈ ప్రాంత ప్రజలముందు మరో అనుభవం కూడా వుంది. కంచికచర్ల మండలం గండేపల్లిలో నిర్మించిన సెంటినీ బయోప్రొడక్ట్సు పరిశ్రమ మొక్కజొన్నలనుంచి ఆల్కాహాలు తయారుచేసే ఫ్యాక్టరీని 3 సం॥క్రింతం నిర్మించింది. ఈ పరిశ్రమ – నిర్దేశించిన పర్యావరణ నిబంధనలకు నిలువెత్తు పాతరవేసి, వ్యర్థ కాలుష్య జలాలను రైతు పంట పొలాలు, కాల్వలునుంచి వైరా ఏటిలోకి విడుదలచేయడంతో – ఏటిలోని చేపలు చనిపోవటమేకాక, సుబాబుల్, మాగాణి పొలాలు ఎండిపోయాయి. ఈ నీటిని తాగిన పశువులు చాలా చనిపోయాయి. పరిశ్రమనుంచి కాలుష్యపు దుర్గంధంతో కూడిన వాయువులు వెలువడడంతో మహిళలు గర్భాల్ని కోల్పోయారు. అనేకమందికి శ్వాసకోశవ్యాధులు, తీవ్రమైన తలనొప్పులు, వాంతులు, ఇతర అనేక జబ్బులకు గండేపల్లి గ్రామప్రజలు గురయ్యారు. ఆనాటినుంచి నేటివరకు చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రజలు, రైతులు ఈ పరిశ్రమనుంచి వెలువడే దుర్గంధంతో అనేక అవస్థలు పడుతూ జీవచ్ఛవాలుగా వున్నారు.

అలాగే–రానున్న కొద్ది సం॥లలో జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలోని ప్రజలు, రైతాంగం అందరూ ఈ ప్రాంతాన్ని వదలివెళ్ళే పరిస్థితిని పాలకులు కల్పిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే సిమెంట్, ఫార్మా కెమికల్స్ తదితర పరిశ్రమలు, బొగ్గు రవాణా నుంచి వెలువడుతున్న ధూళి, దుర్గంధం, కాలుష్యపు కోరలకు చిక్కి ప్రాణాంతకమైన టి.బి.లాంటి దీర్ఘవ్యాధులకు, శ్వాసకోశవ్యాధులకు గురైనవారు అశేష సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ కాలుష్యాన్ని నివారించే చర్యలకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులుగాని, ప్రభుత్వ జిల్లా, ఉన్నతాధికారులుగాని ప్రజలపట్ల బాధ్యతగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రజలు ఆందోళనచేస్తే కంటితుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. వివిధ విభాగాలకు చెందిన కొంతమంది అధికారులను కంపెనీల యాజమాన్యాలు ప్రలోభపెట్టి వారిచేత కాలుష్య ప్రభావం లేదని తప్పుడు ధృవీకరణలను సృష్టిస్తూ ప్రజల నోర్లు మూయిస్తున్నారు. ఎప్పటిలాగే ప్రజలు మరలా కాలుష్యంలోనే తమ జీవితాలను నెట్టుకువెళ్తున్నారు.

తాతల కాలంనుంచి ఈ భూములనే నమ్ముకొని జీవిస్తున్న రైతులు నేడు బోర్లమీద వ్యవసాయాన్ని అభివృద్ధిచేసి వివిధ రకాల పంటలను పండిస్తూ తాము జీవిస్తూ, అనేకమందికి జీవనోపాధిని కల్పిస్తూ, ప్రజలకు ఆహారాన్ని, అవసరాలను తీరుస్తున్నారు. అటువంటి రైతులకు నేడు కష్టకాలం దాపురించింది. వివిన్ లేబొరేటరీస్ వారి బల్క్‌డ్రగ్స్ పరిశ్రమ నిర్మాణం జరిగిన వెంటనే దీనిప్రక్కనే ఇదే తరహాలో మరొక బల్క్‌డ్రగ్స్ పరిశ్రమని ఏర్పాటు చేయటానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాలుష్యపు రసాయనిక వాయువులను వెదజల్లే పరిశ్రమలమధ్య వ్యవసాయం చేయలేరు. చుట్టుప్రక్కల నివాసాన్ని కూడా ఏర్పాటు చేసుకోలేరు. అవసరాలకు భూములను అమ్ముకుందామన్నా ఇక్కడకొచ్చి వ్యవసాయం చేసేవారు ఉండరు. చివరకు అయిన కాడికి తెగనమ్ముకునే స్థితిని కల్పించబోతున్నారు. రైతాంగాన్ని ప్రజలను ఆందోళనల్లోకి రానీయకుండా చేయడానికి యాజమాన్యం అన్నిరకాల కుటిల యత్నాలను సాగిస్తున్నది.

ఉన్న ఊరిని, కన్నతల్లిలాంటి భూమిని వదులుకొని, వలసకూలీలుగా, నిర్వాసితులుగా బతకాల్సిన పరిస్థితిని ఈ ప్రాంతపు రైతాంగానికి, వివిధ వర్గాల ప్రజలకు కల్పించ పూనుకున్నారు. కాలుష్యంలేని సమాజంకోసం అన్ని గ్రామాల ప్రజలు, రైతాంగం ఒకరికొకరు అండగా నిలబడి పచ్చని పల్లెల్లోని జీవితాల్లో కాలుష్యాన్ని నింపుతున్న, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్న పరిశ్రమలను మూసివేయాలని, కొత్తగా నిర్మించకుండా కట్టడిచేయాలని, ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ఇప్పటికే సాగిస్తున్న ఉద్యమాన్ని ఐక్యంగా, సంఘటితంగా తీవ్రతరం చేయాలి. ✡

## కేంద్ర బడ్జెట్టు ... (2వ పేజీ తరువాయి)

పెంచుతామనీ చెప్పాడు. పని దినాల కల్పన రెట్టింపు చెయ్యాలన్నా, వేతనాలను అధికారిక కనీస వేతనాలకు పెంచాలన్నా ఈ పథకానికి కేటాయింపులు రెట్టింపుకు పైగా పెంచాలి. కానీ గత ఏడాది కేటాయింపు రూ॥ 40 వేల కోట్లయితే ప్రస్తుత బడ్జెట్టులో మరో వంద కోట్లు మాత్రమే పెంచాడు. ఇదికాక ఎరువుల సబ్సిడీని, ఆహార సబ్సిడీని కూడా తగ్గించాడు.

విద్యాహక్కు చట్టం చేశారు. దాని అమలుకు విద్యలోని అన్ని రంగాలకూ కలిపి 24 శాతం కేటాయింపులు పెంచినట్లు ఘనంగా ప్రకటించాడు. 2015 నాటికి దేశజనాభాలో 70 శాతం మంది పనిచేసే వయసులో వుంటారనీ ఆర్థికమంత్రిగారే చెప్పారు. వీరందరికీ పనిచేయగలిగే నైపుణ్యం పొందేందుకు శిక్షణ గరపాలంటే విద్యారంగానికి నిధుల కేటాయింపును కనీసం రెట్టింపు చేయాలి. దానిలో నాల్గోవంతు మాత్రమే పెంచారు. రంగాల వారిగా చూస్తే ప్రాథమిక విద్యకు పెంచిన మొత్తం రూ॥ 2700 కోట్లు 9,10 తరగతులలోని దళిత, ఆదివాసీ విద్యార్థుల ఫీజులు తిరిగి చెల్లిస్తామన్న ఆర్థిక మంత్రి కొత్త పథకానికే సరిపోతాయి. ఇక మాధ్యమిక విద్యకు పెంచిన కేటాయింపులుకూడా ఫీజు రీయింబర్సుమెంటుకే సరిపోతాయి. అలాగే ఉన్నత విద్యకు పెంచిన కేటాయింపులన్నీ కొన్ని విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, ఐఐయంలకు పరిశోధన కొరకు ఇచ్చినవే. అంటే విద్యలోని ఏ రంగంలో కూడా ప్రభుత్వం కొత్తగా పాఠశాలలుగానీ కాలేజీలుగానీ ప్రారంభించదు. వీటిని పెంచకుండా ప్రతిపిల్లవాడికి విద్యనందించటం సాధ్యంకాదు.

ఇక వైద్యఆరోగ్యరంగానికి వస్తే గ్రామీణ ఆరోగ్య పథకానికి కేటాయింపులు గత రూ॥ 2600 కోట్లను నామమాత్రంగా పెంచారు. ఈ పథకం క్రింద ఆశా వర్కర్లకు ఇస్తున్న వేతనం 500 రూ॥ ఈ వేతనంతో ఆ మహిళలు ఆరోగ్యసేవలెలా అందిస్తారో ఊహకు కూడా అందదు. వీరి వేతనాలు 3500 రూ॥లకు పెంచుతామని (అది ప్రకటిత కనీస వేతనంకన్నా చాలా తక్కువ) అధినాయకులు వాగ్దానాలు చేశారు. వారికి 500 రూ॥ వేతనమే కొనసాగుతుందని బడ్జెట్టు కేటాయింపులు తెలిపాయి. వాస్తవానికి ప్రజారోగ్యంపై కేంద్రప్రభుత్వ వ్యయాన్ని గత రూ॥ 2767 కోట్ల లోనూ రూ॥ 607 కోట్లు తగ్గించారు. వైద్య ఖర్చులు నానాటికీ పెరుగుతుండగా, ప్రభుత్వ ఆస్పత్రులను పెంచేందుకు ఎలాంటి కేటాయింపులూ లేవు. 20 శాతం కేటాయింపులు పెంచారు. అది ఆర్థిక మంత్రిగారు బీడి కార్మికులు, గనుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న కార్మికులు మొదలగు వారికి బీమా పథకాన్ని చేపడతామన్న దానికీ, పెరిగిన ద్రవ్యోల్బణానికే సరిపోతాయి. ఈ పథకం పేరిట బీమా కంపెనీలకు ద్రవ్యనిధులు సమకూరుస్తారు తప్ప వైద్య సేవలను విస్తరించరు. ఇలా చెప్పుకుంటూపోతే సామాజిక వ్యయమంటున్న ఈ రంగాల తీరు అంతా ఇలాగే వుంటుంది. ప్రజా అవసరాలకూ, ప్రభుత్వ బాధ్యతకూ ఏమాత్రం పొంతనలేని అరకొర కేటాయింపులూ, అవికూడా ప్రైవేటు పెట్టుబడిని బలీయం చేసేందుకు మళ్లించటం ఒక విధానంగా సాగుతున్నది.

సంక్షేమం పూజనీయ మంటూనే పూజ్యం చేస్తున్న ఆర్థిక మంత్రి దీనిని కప్పిపుచ్చేందుకు నగదు బదిలీ పథకాన్ని ముందుకు తెచ్చాడు. 2012 చివరినాటికి దీనినమలులోకి తెస్తామంటూ, ప్రస్తుతం ఎరువులు, వంటగ్యాసు, కిరోసిన్‌లకు నగదు బదిలీ పథకాన్ని అమలు చేసే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పాడు. వివరాలు పేర్కొనలేదు.

అయితే బడ్జెట్టు పత్రాల ప్రకారం సబ్సిడీలు రూ॥ 1,64,153 కోట్లు వున్నాయి. (2010–11లో) కాగా 2010–12లో ఆహారం, పెట్రోలు ఉత్పత్తులు, ఎరువులపై సబ్సిడీ రూ॥ 1,34,210 కోట్లు. దీనిని తగ్గించివేసి నగదు బదిలీ పథకాని ప్రవేశపెడతారు. సబ్సిడీ ఎంత తగ్గిస్తారు (అంటే ధర ఎంత పెంచుతారు), ఎంత నగదు రూపంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకిస్తారు. ఈ వివరాలేవీ చెప్పలేదు.

నానాటికీ పెరుగుతున్న ధరలతో ఒక పూట కడుపునిండటమే కనాకష్టంగా లక్షలాది కుటుంబాలున్న స్థితిలో సబ్సిడీలను తొలగించి ధరలు పెంచి వేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఇది ప్రధానంగా ఆహార ధరలను పెంచివేస్తుంది. రవాణా ఖర్చులను పెంచి నిత్యావసరాల ధరలను కూడా పెంచివేస్తుంది. దీనితో ప్రజలలో పెరిగే ఆశాంతిని భ్రమలుపాలు చేసేందుకు నగదు యిచ్చే పథకంతో ఆశలు కల్పించటానికి పూనుకుంటున్నది. ఆ విధంగా అందేనగదు కోసం ఎదురు చూసే వారిగా ప్రజలను మిగిల్చి, దోపిడీ వర్గాలకు అనుకూలించే తమ విధానాలనుండి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నది. అందుకనే తెగబడి ప్రజా సంక్షేమాన్ని సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు బలిపెడుతున్నది.

"వృద్ధికి పెద్దపీట" "సంస్కరణలను పటిష్టం" చేసిన బడ్జెట్టు అంటూ బూర్జువా పత్రికలు పతాక శీర్షికలు పెట్టాయి. వృద్ధి అంటే దోపిడీ వర్గాలకు వృద్ధే. సంస్కరణలంటే దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా చేయటమే. ✡

జనశక్తి ప్రచురణ
**ఆంధ్రప్రదేశ్ విభజన కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి**
కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల
వ్యాస సంకలనం
వెల: రు. 15/-

జనశక్తి ప్రచురణ
**విభజనవాద-సమైక్యవాద మూలాలు మార్క్సిస్టు పరిశీలన-కర్తవ్యాలు**
వెల: రు. 5/-
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# ఈస్ట్‌కోస్ట్ థర్మల్ విద్యుత్ కేంద్ర ఆందోళనాకారులను పోలీసులు కాల్చి చంపటాన్ని ఖండించండి!

## సిపిఐ (ఎం-ఎల్), ఎం.సి.పి.ఐ.(యు)


పోలీసులు దగ్ధం చేసిన ఇళ్ళు, గడ్డివాములు


పోలీసులు ప్రయోగించిన బాంబు షెల్స్ చూపుతున్న గ్రామస్తులు


మృతుని ఫోటోతో కుటుంబ సభ్యులు

*(శ్రీకాకుళంజిల్లా సోంపేట థర్మల్ విద్యుత్‌కేంద్ర ఆందోళనాకారులపై **2010** జులై **14**న పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరిని బలిగొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోనే సంతబొమ్మాళి మండలంలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో **2460** మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం చేయతలపెట్టిన మరో థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగానూ ఆ ప్రాంత ప్రజలు ఆందోళన సాగిస్తూవున్నారు. ముఖ్యంగా సోంపేట కాల్పులనుండీ ప్రారంభించి నిరవధిక రిలే నిరాహారదీక్షలు సాగిస్తూ నిరంతరాయ ఆందోళనలో ఉన్నారు.*

*ప్రజల, రైతుల ఆందోళనను అణచివేసి థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణ స్థాపనకే ప్రభుత్వం పూనుకుంది. **2011** ఏప్రిల్ **25**న ప్రతిపాదిత థర్మల్ విద్యుత్ కేంద్ర బాధిత వడ్డితాండ్ర గ్రామంలో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఆందోళనాకారుల శిబిరాలను ధ్వంసం చేశారు. లాఠీఛార్జీ జరిపారు. ఎదుర్కొన్న ప్రజలపై భాష్పవాయువు ప్రయోగించారు. ఇళ్ళల్లోకి చొరబడి మరీ మహిళలు, వృద్ధులతో సహా **150** మందికి పైగా అరెస్టులు చేశారు.*

*తిరిగి ఫిబ్రవరి **28**న మరోమారు ప్రజలపై తీవ్రంగా విరుచుకబడ్డారు. నాటి శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమంపై ఆనాడు భూస్వామ్య, పెత్తందారుల, పోలీసుల దమనకాండను తలపించేలా ప్రజల ఇళ్ళపై బాంబుదాడులు చేసి దాదాపు **150** ఇళ్ళు దహనం చేశారు. భాష్పవాయు ప్రయోగంతోపాటుగా పోలీసులు రబ్బరు బుల్లెట్లను మాత్రమే ప్రయోగించామని చెప్తున్నప్పటికీ కాల్పులలో ఇరువురు మృతులయ్యారు. అనేకమందికి తీవ్రగాయాలయ్యాయి.*

*ఈ నేపథ్యంలో పోరాడుతున్న సంతబొమ్మాళి ప్రాంత ప్రజానీకానికి సంఘీభావం తెలిపేందుకూ, మృతుల కుటుంబాలను పరామర్శించేందుకూ, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళనను ముందుకు సాగించేందుకూ సిపిఐ (ఎం-ఎల్), ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీల ప్రతినిధులు స్థానిక నాయకత్వంతో కలసి కాకరాపల్లి పరిసర గ్రామాల పర్యటన అనంతరం విడుదల చేసిన ప్రకటనను ప్రచురిస్తున్నాం - సంపాదకుడు)*

**శ్రీకాకుళం, 6-3-11 :**

**కాకరాపల్లి** థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాటంలో మృతి చెందిన జీరు నాగేశ్వరరావు, సీరపు ఎర్రయ్యలకు సిపిఐ(ఎం-ఎల్),ఎంసిపిఐ(యు)లు విప్లవ జోహార్లు అర్పిస్తున్నాయి. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియ జేస్తున్నాయి.

కాల్పులకు ముందుగానే 144వ సెక్షన్ విధించి, సంతలకు, మార్కెట్‌కు వెళుతున్న ఆకాశలఖవరం, సీరాపువాని పేటలకు చెందిన ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసారు. వారిని ఎక్కడ ఉంచారనేది ఇప్పటికీ (6-3-11 నాటికి) ఆ గ్రామ ప్రజలకు, బంధువులకు తెలియదు. ఫిబ్రవరి 28న అరెస్టు చేసిన తమవారిని ఏం చేసారని అడగడానికి వెళ్ళిన ప్రజలపై పవర్‌ప్లాంట్ యాజమాన్యంతో కుమ్మక్కయిన పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పోలీసు అధికారులు రబ్బరు బుల్లెట్లను మాత్రమే ఉపయోగించామని చెప్తున్నా అది అవాస్తవం. గాయాల తీవ్రతను గమనిస్తే ఇనుప బుల్లెట్లే ప్రయోగించారని స్పష్టమౌతున్నది. మృతుల పోస్టుమార్టం నివేదికలను కూడా పోలీసులు వెల్లడి చేయటం లేదు. పాలీసుల కాల్పుల్లో సెంటు భూమి కూడాలేని ఇద్దరు నిరుపేదలు మృతి చెందారు. ఇంకొకరు చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఇంకా ఐదుగురు తీవ్ర గాయాలతో సరైన వైద్య సదుపాయం అందక హాస్పిటల్స్‌లో ఉన్నారు. అనేకమంది బాంబులలోని గాజుపెంకుల గాయాలతో అలాగే వారి గ్రామాల్లో ఉన్నారు.

ఆరోజునే వడ్డితాండ్ర గ్రామంపై శత్రుదేశంపై దాడి జరిపినట్లు పోలీసులు దాడి చేశారు. పదుల సంఖ్యలో ఇళ్ళను తగుల బెట్టారు. రోజుల బిడ్డలను కూడాబయటకు విసిరి వేసారు. వయస్సుగల ఆడపిల్లల పట్ల అమానవీయంగా వ్యవహరించారు. నగలు, డబ్బు దోచుకెళ్ళారు. ఇంటిలోని ఇతర వస్తువులు, మోటారు సైకిళ్ళను తగులబెట్టారు. ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. అలాగే పంట కుప్పలను, పశుగ్రాసాన్ని తగులబెట్టారు. గ్రామం నుండి 115 మందిని అరెస్టు చేశారు. వారిలో 26 మంది మహిళలున్నారు. అందులో బాలింతలు, 3 సం॥లలోపు వయస్సుగల పిల్లల తల్లులున్నారు.

సోంపేట కాల్పుల తర్వాత ఈ ప్రాంత ప్రజలు తమ జీవనోపాధి కోల్పోతామని, ఆరోగ్యాలు, పర్యావరణం నష్టపోతామని గ్రహించి, జీవన్మరణ పోరాటంగా అప్పటికి 195 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారు. కాలువకు అడ్డుకట్ట వేసి, తమ పంట నష్టానికి కారణమైన పరిస్థితికి ఆగ్రహించిన ప్రజలు అనేకసార్లు ఆర్.డి.ఓ. కలెక్టరులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోక పోవడంతో తామే అడ్డుకట్టను తొలగించే ప్రయత్నం చేశారు. ఆర్.డి.ఓ. వచ్చి వారంలో తొలగిస్తారని చెప్పడంతో విరమించుకొన్నారు.

ప్రజల విజ్ఞప్తులను, ఆందోళనలను పట్టించు కోకుండా ప్రభుత్వ అధికార్లు, ప్లాంట్ యాజమాన్యం నిరాహారదీక్షా శిబిరంపై దాడి చేసి, ప్రజల్ని అరెస్టు చేసి, భీతావహం చేసారు. చివరికి కాల్పులు జరిపి, ఇద్దరిని చంపివేసి, ప్రజల్ని అరెస్టు చేసారు. ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేశారు. సామ్రాజ్యవాదుల సేవలో తరించే పాలకులు- ప్రజాప్రతినిధుల మని చెప్పుకొనేవారు- ప్రజల జీవితాల్ని, పర్యావరణాన్ని నాశనం చేసేందుకు ప్లాంట్ యాజమాన్యంతో కుమ్మక్కయి ఎంతకయినా తెగిస్తారనేందుకు ఈ ఘటన తార్కాణం.

నిన్న సోంపేట, నేడు కాకరాపల్లి-రేపు కొవ్వాడ- మిగతా ప్రాంతాలన్నింటా ఇదేవిధంగా అణచివేతే సాధనంగా అభివృద్ధి పేరిట విధ్వంసకర విధానాల అమలుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో వుంది. á ఈ నేపథ్యంలో జిల్లా, రాష్ట్ర ప్రజానీకం సమైక్య, సంఘటిత ఆందోళన చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

1. కాకరాపల్లి పోరాటంలో అమరులైన కుటుంబాలకు ఐదు ఎకరాల చొప్పున భూమినివ్వాలి.
2. అరెస్ట్‌అయిన వారందరినీ తక్షణమే విడుదల చెయ్యాలి.
3. ప్రజలపై ఆందోళనాకారులపై అన్నిరకాల కేసులను బేషరతుగా ఎత్తివేయాలి.
4. వడ్డితాండ్ర గ్రామానికి పూర్తి పునరావాసం కల్పించాలి. బట్టలు, వంట సామాగ్రి, నిత్యావసర వస్తువులు, పశుగ్రాసంతో సహా గ్రామస్తులందరికి అందించాలి.
5. ప్రాజెక్టువల్ల నష్టపోయిన పంటకుగాను, ఎకరాకు పదివేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని తక్షణమే కల్పించాలి.
6. ప్రజల జీవన విధానాన్ని తీవ్రంగా దెబ్బతీసే థర్మల్ ప్లాంట్‌లను ఎత్తివేయాలి.
7. ఇద్దరి మరణానికి, అనేక మంది క్షతగాత్రులు కావడానికి, ప్రజల ఆస్తుల ధ్వంసం కావడానికి, జన జీవనం అస్తవ్యస్తం కావడానికి కారణమైన ప్లాంట్ యాజమాన్యాన్ని బహిరంగంగా విచారించి, కఠినంగా శిక్షించాలి.
8. కాల్పులకు కారణమైన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించాలి.
9. ఫిబ్రవరి 25 నుండి 28 వరకు జరిగిన సంఘటనలపై హైకోర్టు న్యాయమూర్తి చేత వెంటనే విచారణ జరిపించాలి.

**యస్. ఝాన్సి,** సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు
**కె. కోటయ్య,** సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు
**తాండ్ర అరుణ,** సిపిఐ(ఎం-ఎల్)
**ఎస్. గంగాధరరెడ్డి,** ఎంసిపిఐ(యు) రాష్ట్రనాయకులు
**జి. వరాహమూర్తిరెడ్డి,** ఎంసిపిఐ(యు) నాయకులు
**గణేష్ పండా,** సిపిఐ(ఎం-ఎల్)

## కాకరాపల్లి పోలీసు కాల్పులను నిరసిస్తూ ధర్నా

**బందరు, 2-3-11,**

**శ్రీకాకుళంజిల్లా** సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటును నిరసిస్తూ అప్పటికి 195 రోజులుగా దీక్షలు చేస్తున్న వడ్డితాండ్ర మత్స్యకారులపై వేలాదిమంది పోలీసులు గ్రామాల్లో ప్రవేశించి, నిరాహారదీక్ష శిబిరాలను తొలగించి ఇళ్ళల్లోదాక్కున్న మహిళలను జుట్టుపట్టుకుని ఈడ్చి లాఠీలతో దాడి చేశారు. ఉద్యమిస్తున్న రైతులపై కాల్పులు జరిపి ఇద్దరి మృతికి కారణమై, వందలాదిమంది రైతులు గాయాలపాలవడానికి, నివాస గృహాలు తగలపడిపోవటానికి కారణమైన విధానాలను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), స్త్రీవిముక్తిసంఘటన ఖండిస్తూ స్థానిక కోనేరు సెంటర్‌లో ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా కోశాధికారి కా॥ లీలామనోహర్ మాట్లాడుతూ 'ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ సంస్థ 2640 మెగావాట్ల బొగ్గు అధారిత విద్యుదుత్పాదన కేంద్రాన్ని నిర్మిస్తుందనీ, దీన్ని వ్యతిరేకిస్తూ కాకరాపల్లి చుట్టూత గ్రామాలరైతులు వివిధ సంఘాలు, పర్యావరణ వేత్తలు పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ యాజమాన్యం బలవంతంగా నిర్మాణానికి పూనుకొన్నారనీ, మత్స్యకారుల ఆందోళనకు మద్దతుగా అంట్లవరం, ఆకాశలక్కవరం, హెచ్.ఎన్.పేట తదితర గ్రామాల ప్రజలు మద్దతుగా నిలిచారనీ, యాజమాన్యంతో కుమ్మక్కై వేలాదిమంది పోలీసులు కాకరాపల్లి చేరుకుని కొంతమంది నాయకులను అదుపులోకి తీసుకుని శిబిరాలను తొలగించారనీ, పిమ్మట నిరసన కారులపై కాల్పులు జరిపి గాయపర్చి భయభ్రాంతులకు గురిచేశారనీ, న్యాయపరమైన హక్కులకోసం పోరాడుతున్న రైతులను, కూలీలను కాల్చిచంపటాన్ని వ్యతిరేకిస్తూ కాకరాపల్లి తదితర గ్రామాలప్రజలు చేస్తున్న పోరాటానికి మద్దతు తేలియజేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కా॥ రాంబాబు; స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ నాగమణి, బేబి తదితరులు పాల్గొన్నారు. ✡

## జనశక్తి యాజమాన్య వివరాలు

(ఫారం 4 రూల్ 8 ప్రకారం)

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | విజయవాడ, 520 002 |
| 2. | ప్రచురణ కాలం | : | పక్షానికొకసారి (పక్ష పత్రిక) |
| 3. | ముద్రాపకుని పేరు<br>జాతీయ, చిరునామా | : | పి.జస్వంతరావు, భారతీయుడు<br>32-13-26/1, బోయపాటి మాధవరావు రోడ్,<br>మొగల్రాజపురం, విజయవాడ-520 010 |
| 4. | ప్రచురణ కర్త పేరు,<br>జాతీయ, చిరునామా | : | పై విధంగానే |
| 5. | సంపాదకుని పేరు | : | పి.జస్వంతరావు |
| 6. | భాగస్వాములు | : | - |
| 7. | పైన పేర్కొన్న విషయములన్నియు యదార్థం | | 20.3.2011 |

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010